www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 162 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | కడప సిటీ**

Kadapa | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం 10-6-2024
Kadapa | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
అన్నమయ్య సిటీ**

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 18వ ర్యాంకు


ప్రభాకర్‌రెడ్డి

చిన్నమండెం, జూన్ 9: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డి, ఈశ్వరమ్మ దంపతుల రెండవ కుమారుడు కుమారకాల్వ ప్రభాకర్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఈడబ్ల్యూసీ ప్రకారం ఆల్‌ఇండియాలో 18వ ర్యాంకు సాధించాడు. కాగా 278 మార్కులు సాధించి ఆలిండియాలో 227వ ర్యాంకు సాధించారు. దేశంలోనే పేరు గాంచిన ముంబాయి ఐఐటీ కాలేజీలో సీటు దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. తాను ఎప్పటి నుంచో ముంబాయి ఐఐటీలో చదవాలనే కల అతి త్వరలో నెరవేరబోతోందని ప్రభాకర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మా తల్లిదండ్రులు వ్యవసాయం చేసి తనను చదివిస్తున్నారని, తాను ఎప్పటికైనా గొప్ప సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి మా తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొస్తానని ఆయన చెప్పుకొచ్చారు. తమ కుమారుడు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించడంపై వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోరని అఘాయిత్యం

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ప్రేమికులిద్దరూ మృతి
- మొదట ప్రియురాలు.. అనంతరం ప్రియుడు మృతి


నరేంద్ర మృతదేహం


మృతి చెందిన రాణి (ఫైల్)

ములకలచెరువు, జూన్ 8: ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేరని ప్రేమికులు బలన్మరణానికి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం దేవళచెరువుకు చెందిన మెడిమి నరేంద్ర (24), వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన రాణి ప్రేమించుకుంటున్నారు. వేపూరికోటలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న నరేంద్ర అక్కడ పని మానేసి బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గత నెల 12వ తేదీ స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. వారిద్దరి కులాలు వేరు కావడంతో తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన నరేంద్ర, రాణి ఈనెల 7వ తేదీ ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సంద్రడవిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరకుని అపస్మారక స్థితిలో ఉన్న ప్రేమికులిద్దరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి నుంచి రాణిని తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. అలాగే మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేంద్ర కూడా ఆదివారం ఉదయం మృతి చెందాడు. పెద్దతిప్పసముద్రం మండల పరిధిలో ఈ ఘటన జరగడంతో ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమికులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడడంతో వారి స్వగ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామాలకు తరలించారు.

పుల్లగూరగండిలో పడి విద్యార్థి మృతి


మృతి చెందిన అద్నాన్

రాయచోటి టౌన్/వీరబల్లి, జూన్ 9: వీరబల్లి మండలంలో గల పుల్లగూరగండిలోని నీటి గుంటలో పడి ప్రమాదవశాత్తు అద్నాన్ (15) మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణంలోని నాయబ్‌సాబ్‌వీధికి చెందిన టైలర్ షకీల్ కుటుంబం ఆదివారం సెలవురోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన విద్యార్థి అద్నాన్ భోజనం అనంతరం చేయి కడుక్కునేందుకు నీటి గుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందడంతో షకీల్ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు రాయచోటి పట్టణంలో పదో తరగతి చదువుతున్నాడు. టైలర్ షకీల్‌కు నలుగురు పిల్లలుండగా అందులో పెద్ద కొడుకుని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పుల్లగూరగండిలో ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న వీరబల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరు భూఆక్రమణలపై సీఐడీ విచారణ

- జాతీయ రహదారి పనుల పేరుతో జరిగిన విధ్వంసాలపై విజిలెన్స్
- పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టీకరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 9: పీలేరులో రూ.వేల కోట్ల విలువైన వందలాది ఎకరాల భూముల ఆక్రమణలపై సీఐడీతో విచారణ చేయించనున్నట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలు మంత్రి అండదండలతో విలువైన ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించారని, అందులో చాలా భూములు ఇళ్ల స్థలాల పేరుతో అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన నగరిపల్లెలో ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల భూదందాలకు సంబంధించి అప్పట్లో తాను పూర్తి ఆధారాలతో వెల్లడించినట్లు గుర్తు చేశారు. దీనిపైన ఐఏఎస్ అధికారిణి విచారణ జరిపి ఆరోపణలన్నీ వాస్తవమేనని తేల్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ భూములుగా అధికారికంగా గుర్తించిన వాటికి జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్‌వోసీలు జారీ చేయించారని వివరించారు. జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువైన ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ భూముల్లో బినామీ పట్టాలు మంజూరు చేయించి దురాక్రమణకు పాల్పడ్డారని కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలు పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. వీటన్నిటి పైనా సీఐడీతో సమగ్ర విచారణ చేయించనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం పూర్తి కాగానే పీలేరు, కలికిరిలో జరిగిన ఇళ్ల స్థలాల ఆక్రమణలు, వాటి నిర్మాణాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతామన్నారు. పీలేరు పట్టణంలో దాదాపు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ జరిగిందంటున్నారని, పట్టా కాగితాలు తూకం లెక్కన అమ్ముకున్నారని విమర్శించారు. ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు పెట్టాలని ప్రయత్నిస్తుంటే వాటిని ఇళ్ల స్థలాల పేరుతో అమ్ముకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలన్నీ బినామీవేనని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఆక్రమించిన విలువైన భూముల్లో ఇవ్వాలని తాను మొదటి నుంచి డిమాండు చేస్తున్నానని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో రెవెన్యూ అధికారులు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.

జాతీయ రహదారి నిర్మాణం పేరుతో విధ్వంసం

నాలుగు లేన్ల జాతీయ రహదారి పనుల పేరుతో ప్రకృతి వనరులను విధ్వంసం చేశారని ఆరోపించారు. పనుల కోసం అక్రమంగా ఇసుక తరలించారని, చెరువులు, కొండలు, గుట్టలను ఇష్టానుసారం ధ్వంసం చేశారని చెప్పారు. రహదారి పనులు ముఖ్యమే అయినా చెరువుల్లో మట్టి కోసం ఇరిగేషన్ శాఖ నుంచి, కొండలు గుట్టల కోసం రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ నిబంధనలేవీ పాటించకుండా ఎమ్మెల్యే, ఎంపీలు దళారీలను ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలతో చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

మైనింగ్ కోసం తమిళనాడులో బ్రోకరింగ్ ఆఫీసు

మైనింగ్ పేరుతో జిల్లాలో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారని, దీనికోసం తమిళనాడు సరిహద్దుల్లో ఒక బ్రోకరింగ్ కార్యాలయాన్నే ఏర్పాటు చేసి ప్రైవేటు మైనింగ్ సంస్థల నుంచి భారీగా వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇందులో ప్రభుత్వానికి చెల్లించినది ఎంత, వీళ్లు దిగమింగినదెంత అనే విషయం తేలాల్సి ఉందన్నారు. మంత్రి పేరుతో మైనింగ్ డైరెక్టర్లు వసూళ్లకు తెగపడ్డారని విమర్శించారు. మైనింగ్, మద్యంపై ప్రభుత్వం విచారణ చేయిస్తుందని తెలిపారు. సమావేశంలో కిశోర్‌కుమార్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథ రెడ్డి, చంద్రశేఖర్, బోడేషావల్లి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో కిలో టమోటా రూ.60

మదనపల్లె టౌన్, జూన్ 9: మదనపల్లె టమోటా మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో రూ.60 ధర పలికింది. ఆదివారం మదనపల్లె టమోటా మార్కెట్‌కు 597 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా బహిరంగ వేలంలో మొదటి రకం టమోటా గరిష్టంగా కిలో రూ.60 పలకగా, కనిష్టంగా కిలో రూ.50 పలికింది. అదేవిధంగా రెండో రకం టమోటా కిలో గరిష్టంగా రూ.48 పలకగా కనిష్టంగా కిలో రూ.36 ధర పలికింది. గత నెల ఆంధ్రజ్యోతిలో టమోటా ధరలు పైపైకి అన్న శీర్షికన ప్రచురితమైన కథనం నిజమని తెలుస్తోంది. ఉత్తర భారతదేశంలోని పంజాబ్, రాజస్థాన్, ప్రాంతాల్లో టమోటా సీజన్ ముగియడంతో అక్కడి వ్యాపారులు దక్షిణ రాష్ట్రాల వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లె, కోలారు టమోటా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో ఈ సీజన్‌కు టమోటా టాప్ ధర కిలో 60 పలికింది. రాబోయే రోజుల్లో టమోటా కిలో రూ.100 ధర పలికినా ఆశ్చర్యపోనవసరం లేదు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జూన్ 9: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్య కైంకర్యాల అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణ చేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల నడుమ కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గ్రామీణాభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 9: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని బి.ఎర్రగుడి పంచాయతీలో ఆయన పర్యటించారు. సీనియర్ నాయకుడు ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె ప్రజలు తనను ఎంతో ఆదరించారని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ లక్కిరెడ్డిపల్లె ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని రాంప్రసాద్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. లక్కిరెడ్డిపల్లె మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎంత అభివృద్ధి చేయాలో అంతా చేస్తామన్నారు. మండలంలోని పాలెం గొల్లపల్లె, పందెలపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, దప్పేపల్లెలో రోడ్లను త్వరలోనే బాగుచేయిస్తామన్నారు. అనంతరం గ్రామాల వారీగా ప్రజలను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు యూత్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదనమోహన్, మండల యూత్ ప్రెసిడెంట్ ఆరిఫుల్లా, సీనియర్ నాయకుడు వెంకటరామిరెడ్డి, రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డా.షఫీ నాయక్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, రజాక్, మూవీ వెంకటరమణ, రంగారెడ్డి, చిన్నపెడ్డి, పేరయ్య, ఓబులేశు, తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమంలో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నానని, వారి రుణాన్ని తీర్చుకుంటానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి నిర్విరామంగా కృషి చేస్తానని తెలిపారు. చంద్రబాబు ఆధ్వర్యంలోని ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ పరిబాష, మహమ్మద్ రియాజ్, శ్రీనివాసరాజు, భద్రప్ప నాయుడు, పొట్లి జగన్నాథరెడ్డి, టీడీపీ నాయకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి, నాగేశ్వరరావు, ఈశ్వర్ రెడ్డి, వీరాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, చంద్ర, చిట్టిమాబాషా, హఫీజ్ అల్లా, కృష్ణాంజనేయులు, రామక్రిష్ణారెడ్డి, బ్యాంకు శ్రీను, పురుషోత్తం రెడ్డి, రాజేశ్‌రెడ్డి, శేషాచలం తదితరులు పాల్గొన్నారు.



రాంప్రసాద్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎర్రగుడి గ్రామస్తులు

ఎమ్మెల్యేనుని కలిసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

సంబేపల్లె: రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదివారం స్టేట్ పీఆర్టీయూ ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లమల రామాంజులు ఉపాధ్యాయ సంఘ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిశ్రీరాములు, వెంకటరామరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. పీఎన్ కాలనీ ఊటుపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు బొల్లం వెంకట్రమణనాయుడు, కొండమర్ల రామచంద్ర, కొండమర్ల చంద్ర ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఊటుపాలెంలో వెలసిన అనంతపురమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యకర్తలు, గ్రామస్తులు టపాసులు పేల్చుతూ పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊపిరి ఉన్నంతవరకు కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, టీడీపీ నాయకులు మండిపల్లి రాహుల్‌రెడ్డి, బల్లెం శ్రీరాములునాయుడు, బల్లెం సతీశ్, బల్లెం వెంకటేశ్వర్లునాయుడు, శివప్రసాద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బసిరెడ్డి, నాగిరెడ్డి, శేషాద్రిరెడ్డి, హేమంత్, కొండమల్ల వెంకటాద్రి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి కృతజ్ఞతలు

రాయచోటిటౌన్: రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మైనార్టీ నేత ముస్తాక్‌హుస్సేన్‌కు ఆదివారం ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాయచోటి నియోజకవర్గ సమస్యలపై ఏకాంతంగా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో గోరాన్‌చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసులురాజు, టీడీపీ నేతలు రాహుల్‌రెడ్డి, రమణారెడ్డి, వతన్‌సలీం, మహేశ్, ఫిరోజ్, అజీమ్, మహబూబ్‌అలీ, అక్బర్, ఫయాజ్, ఆస్రఫ్‌అలీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజుతో భేటీ

రాయచోటిటౌన్: తన గెలుపునకు సహకరించిన అన్నమయ్య జిల్లా టీడీపీ చమర్తి జగన్‌మోహన్‌రాజును ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు, నాదెండ్లను కలసిన నేతలు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలసిన ముక్కా రూపానందడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 9: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారాపు అచ్చెన్నాయుడు, జనసేన నేత నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం విజయవాడలో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రైల్వే కోడూరును గెలిచి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కానుకగా ఇచ్చామని తెలిపారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం పూర్తి అయిన నాటి నుంచి రైల్వే కోడూరు అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు, జూన్ 9 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మూడుసార్లు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. పండ్ల తోటలకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చిందని రైతన్నలు అంటున్నారు. బీడు భూముల్లో గ్రాసం కూడా పెరిగి పశువులకు సమృద్ధిగా పచ్చిమేత లభిస్తుందని పాడి రైతులు అంటున్నారు.

పట్టపగలే ఇసుక అక్రమ తరలింపు



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్

సిద్దవటం, జూన్ 9: మండల పరిధిలోని టక్కోలి సమీపంలోని పెన్నానది నుంచి ఆదివారం పట్టపగలే ఇసుక అక్రమంగా తరలిసున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు పత్రికల్లో వార్తలు వస్తున్నా స్పందన కనిపించడంలేదని స్థానికులంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో చంద్రను వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు కొంతమంది ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని, ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్, జూన్9: పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో ఉన్న రామాంజనేయాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని , గత 28 నెలలుగా దిగ్విజయంగా ప్రతి నెల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. మరో 14 నెలల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగానే ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6.30 గంటల నుంచి బాడేపల్లి అమరావతి, నిమ్మనపల్లి రేణుకానందరెడ్డి, చరిష్మారెడ్డి, బాలసాయి తేజ్‌రెడ్డి, బీ. రేణుక, బీ. మల్లికార్జున రెడ్డి, చరణ్‌తేజ్‌రెడ్డి, అర్జున్‌ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

ముగిసిన యల్లమ్మ తిరుణాల



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

గాలివీడు, జూన్9: మండలంలోని నాగూరివాండ్లపల్లె సమీపంలో రేణుక యల్లమ్మ తిరుణాల ఆదివారం ముగిసింది. మూడు రోజులుగా అమ్మవారిని వివిధ గ్రామాల్లో ఊరేగించారు. శనివారం రాత్రి చాందినీ బండ్లు ఏర్పాటు చేశారు. ప్రతి బండి వద్ద చెక్కభజనలు, కోలాటాలు వంటివి భక్తులను విరివిగా ఆకర్షించాయి. బాణసంచా కాల్చుతూ అంగరంగ వైభవంగా చాందినీ బండ్లను ప్రదర్శించారు. ఆదివారం ఉదయం బోనాలు సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

వైభవంగా రేణుకా యల్లమ్మ జాతర



దేవాలయ ప్రాంగణంలో యల్లమ్మ, గంగమ్మలకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తజనం

పెనగలూరు, జూన్ 9: మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవత రేణుక యల్లమ్మ జాతర నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి సాంగెం తీసుకుని వచ్చి యల్లమ్మ గుడి ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి సమర్పించారు. ఈ క్రమంలో మేకపోతులు, పొట్టేళ్లను, కోడిపుంజులను బలిచ్చారు. యల్లమ్మతో పాటు దేవాలయం ముందున్న గంగమ్మ గుడి వద్ద కూడా పూజలు నిర్వహించారు. గ్రామ ప్రారంభంలోని అంకాలమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ, రేణుకా యల్లమ్మ ఉత్సవ విగ్రహాలతో పాటు మూల విరాట్‌ను కూడా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పురోహితులు చెంచు సుబ్బనరసయ్య స్వామి , తాజా,మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు ప్రతీక సీఐటీయూ



సీఐటీయూ చేరిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నేతలు

రాయచోటిటౌన్, జూన్9: సమరశీల పోరాటాలకు ప్రతీక సీఐటీయూ అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రెసిడెంట్ కే. నాగభూషణం అన్నారు. ఆదవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్ల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన 55 ఏళ్ల కాలంలో అనేక రకాల కార్మికులకు సంఘాలు పెట్టి వారి హక్కులు, చట్టాల అమలుకు నీతి, నిజాయితీ క్రమశిక్షణతో రాజీలేకుండా పోరాడుతోందన్నారు. గత డిసెంబర్‌లో మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేయాలని సమ్మెలో మొదటి అడుగు వేసి చివరి వరకు జీవోల సాధనకు పోరాటం చేసిన సంఘం సీఐటీయూ అని కొనియాడారు. అంగన్వాడీ, ఆశ, సంఘమిత్ర, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు నాయకత్వం వహించడమే గాక వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడంలో కూడా సీఐటీయూ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. పెట్టుబడిదారీ ప్రభుత్వాలను కూల్చి కార్మిక వర్గ రాజ్యస్థాపన చేయడమే ధ్యేయంగా సీఐటీయూ పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీఐటీయూ విస్తరణకు నడుం బిగించాలని కోరారు. సీఐటీయూ విధానాలు నచ్చడంతో 28 మంది మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు స్వచ్ఛందంగా సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పీ. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు వారిని అభినందిస్తూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు రకాల లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు సీఐటీయూ పోరాడుతుందన్నారు. సీఐటీయూలో చేరిన వారిలో బీవీ రమణ, శంకరయ్య, చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, మహేశ్, వెంకటలక్ష్మి, మౌనిక, చిన్నమ్మి, రమేశ్‌బాబు, ఈశ్వరమ్మ, సావిత్రి, యశోద, గిరి, నాగసుబ్బులు, శంకర, షఫీ, సురేశ్, అంజి, నాగేశ్వరి, పురుషోత్తం, జయరాం, పార్థసారథి, మధుకర్ తదితరులు మాట్లాడుతూ సీఐటీయూ విధానాలు అనుకరిస్తూ పోరాటాలు పెరుగుదలకు కృషి చేయడంతో పాటు సంఘం మరింత బలోపేతానికి విస్తరణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓబులమ్మ, మున్సిపల్ జిల్లా నాయకులు లక్ష్మిదేవి, ప్రసాద్, రమణ, పెంచలయ్య, సాలమ్మ, రవిశంకర్, చెన్నయ్య, రాంబాబు, వెంకట్రమణ, కేశమ్మ, శుభాషిణి, ఉమామహేశ్వరి, ఆంజనేయులు, కేశమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర యూటీఎఫ్ కార్యదర్శి లక్ష్మిరాజ



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

రాయచోటిటౌన్, జూన్ 9: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డైట్ కేంద్రంలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 117 రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలని, పాఠశాల విలీనం రద్దు చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ తెలుగు మీడియం పునరుద్ధరించాలని కోరారు. తిరోగమన దిశలో ఉన్న విద్యారంగంపైన ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని నూతన ప్రభుత్వాన్ని కోరామన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ మెడికల్ బిల్లులు, ఉపాధ్యాయ సంక్షేమం వైపు కూడా కాస్త దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం నూతన ప్రభుత్వానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సహాధ్యక్షుడు శివారెడ్డి, హేమలత, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు రమణ మూర్తి, పురం వెంకట్రమణ, ఆదినారాయణ, శ్రీధర్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డ, పూర్వం జిల్లా కార్యదర్శి గగాదేవిలతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీరావుకు జర్నలిస్టుల ఘననివాళి



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

రాజంపేట, జూన్ 9 : ఈనాడు పత్రికాధినేత రామోజీరావు మృతి తీరని లోటని జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణంలో ఆదివారం రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహిళా జర్నలిస్టు శ్రీలత, సీనియర్ పాత్రికేయులు గోపాల్, రామచంద్ర, రమేష్, సుబ్బ నరసింహులు, విజయ్ కుమార్, గణేష్, ఈనాడు ఆచారి, సుధాకర్, శివ, వెంకటరమణ, ప్రభాకర్ నాయుడు, నాగేంద్ర తదితరులు మాట్లాడుతూ పత్రికా రంగానికి, తెలుగు భాషకు రామోజీరావు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.

మోదీ ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు



కేకు కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు

నందలూరు, జూన్ 9 : నరేంద్ర మోదీ భారతదేశ ప్రధానిగా మూడవ సారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ఆదివారం సాయంత్రం కూటమి నేతలు కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టంగుటూరు, ఓబిలి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమినేతలు పోతురాజు మస్తానయ్య, జంబు సూర్యనారాయణ, హిమగిరినాథ్‌యాదవ్, సయ్యద్ అమీర్, హెచ్ నాగరాజరావు, దండు నాగేశ్వరరావు, మునుస్వామి, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, తాటిసుబ్బరాయుడు, మౌలా,ఉల్లి ఉపేంద్రకుమార్, జంగంశెట్టి సుబ్బయ్య, నారపుశెట్టివేణు, గంధం గంగాధర్, గుండు సురేష్, గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, గురువిగారివాసు, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



యజ్ఞశాలలో పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

రామాపురం, జూన్9: ఎంత విన్నా తనివి తీరనిది మహాభారతమని మహా భారత యజ్ఞ కమిటీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్ రెడ్డి స్థల దాత పట్టాభిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి అన్నారు. రామాపురంలో ఆదివారం కమిటీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, స్థల దాత అయోధ్యాపురం పట్టాభిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి మహాభారత యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాభారత యజ్ఞం ఆదివారం నుంచి 18 రోజుల పాటు ఈ నెల 26వ తేదీ వరకు పగలు తిరుపతి వాస్తవ్యులు కౌసల్య హరికథ వినిపిస్తారన్నారు. రాత్రి పీలేరుకు చెందిన వెంకటేశ్వర నాట్య కళామండలి బృందం నాటకం ప్రదర్శిసుందన్నారు.

గంగమ్మకు పూజలు



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

చిట్వేలి, జూన్ 9 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో మండల పరిధిలోని సి.కందుల వారిపల్లె పంచాయతీ తుమ్మచెట్ల పల్లె గ్రామ దేవత గంగమ్మకు ఆదివారం ముద్దలు పెట్టుకుని, జంతు బలులిచ్చి పూ జలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు లారీ సుబ్బరాయుడు, యువ నాయకులు కాకర్ల నాగార్జున మాట్లాడుతూ కూటమి విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారన్నారు.

ఓసూరమ్మకు పొంగళ్లు



దేవర దున్నపోతును ఇంటింటికి తిప్పుతున్న జాతర నిర్వాహకులు

చిట్వేలి, జూన్ 9 :మండల పరిధిలోని మైలపల్లె పంచాయతీలో ఆదివారం గ్రామ దేవత ఓసూరమ్మకు పొంగు బాళ్లు, ముద్దలు పెట్టుకుని, జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఏడాదిగా పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మ వారిని శరణు కోరారు.

కొత్తకోడూరు జాతరకు అంకురార్పణ

రైల్వేకోడూరు, జూన్ 9: పంచాయతీ పరిధిలోని కొత కోడూరులో ఈ నెల 12న నిర్వహించనున్న గంగమ్మ జాతరకు ఆదివారం అంకుర్పాణ చేశారు. దేవర దున్న పోతును పట్టుకుని ఇంటింటికి తిరగడంతోపాటు, కుండకు గంగమ్మ ప్రతిమను పెట్టి పూజలు చేశారు. 11 సాయంత్రం నుంచి వేషాలు, 12న జాతర, 13న నిమజ్జనం చేస్తారని నిర్వాహకులు చెన్నంశెట్టి కుమార్ తెలిపారు.

నేడు మంచాలమ్మ తిరుణాల

సుండుపల్లె, జూన్ 9: ముడుంపాడు గ్రామ దేవత మంచాలమ్మ తిరుణాల సందర్భంగా ఆదివారం ఆలయంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో హోమం పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. రాత్రి 7 గంటలకు అన్నదానం, 9 గంటలకు హరికథ కాలక్షేపం, అనంతరం చాందినీ బం డ్లు, ఆలయ ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

24 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, జూన్9: స్థానిక చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అర్హులైన 24 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు, ప్రజలు

రామాపురం, జూన్ 9: స్థానిక గంగమ్మ గుడి వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 101 టెంకాయలు కొట్టి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి శాసనసభ్యుడిగా గెలుపొందడంతో ప్రజలు తమ మొక్కులను తీర్చుకుంటున్నారు.

చిన్నమండెం: తన మొక్కు తీరడంతో జంగంపల్లికి చెందిన అమరేశ్వర్ యాదాద్రి లక్ష్మినరసింహస్వామికి తలనీలాలు సమర్పించాడు. గత మూడు నెలలుగా మండుటెండలో సైతం చెప్పులు లేకుండా ప్రచారం చేశానని అమరేశ్వర్ తెలిపారు.

ముగిసిన గంగమ్మ జాతర



పూనకం వచ్చిన మహిళ సందేశాన్ని వింటున్న గ్రామస్థులు

పెనగలూరు, జూన్ 9: పెనగలూరు పంచాయతీలోని ఇందుల్లూరు హరిజనవాడలో ఆదివారం గ్రామ దేవత గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవార్లు ఆసాదికథ వినిపించారు. గ్రామ పెద్దలు, కార్యకర్తల సహకారంతో గ్రామ ప్రజలు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చు కున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన గ్రామోత్సవం సందర్భంగా నిర్వహించిన రికార్డింగ్ డ్యాన్స్ ఆకట్టుకుంది.

సీఎం రమేష్‌ను కలిసిన ఎద్దుల విజయసాగర్



ఎంపీ సీఎం రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయసాగర్

నందలూరు, జూన్ 9 : అనకాపల్లె ఎంపీ సీఎం రమేష్‌ను డిల్లీలోని ఆయన ఇంటిలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్ ఆదివారం తెలిపారు. ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు వివరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హవా



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ చంద్రకిశోర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 9: జేఈఅడ్వాన్స్ 2024 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల హవా కొనసాగిందని డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో ఆర్.నిఖిల్ 436ర్యాంకు, ఎం.హాసిని 1607, జితేష్‌రెడ్డి 2469ర్యాంకు, పి.లక్ష్మిసాయి హాసిని 2798, సాయివైష్ణవి 2829, బ్రింధా 4717, నీరజ్ శబరీష్ 5551, వై.వినయ్‌కుమార్ 5034, పి.జాగృతి 6653 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులు పట్టుదల, అధ్యాపకు ల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోర్ డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, కేజీఎం చెన్నక్రిష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

జెన్‌కో సీఎండీ, ఎండీ దృష్టికి ఆర్టీపీపీ - ప్రొద్దుటూరు రోడ్డు దుస్థితి

● వారంలో బాగుచేయిస్తామని హామీ : ఎమ్మెల్యే



పూర్తిగా బురమయంగా మారిన ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు

ఎర్రగుంట్ల, జూన్ 9: ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు వయా రామేశ్వరం రోడ్డును వారంలో పనులు మొదలుపెట్టి బాగుచేయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు. జెన్‌కో సీఎండీ విజయానంద్, ఎండీ చక్రధర్ బాబుతో ఫోన్లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ రోడ్డు పనులు వారంలో మొదలుపెట్టి నెలాఖరుకు పూర్తిగా బాగుచేయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. సంబంధిత నిధులు కూడా విడుదల చేస్తారన్నారు. ఎన్‌హెచ్‌లో అనుసంధానం చేసే వరకు ఈరోడ్డును ఎట్టి పరిస్థితిలో గుంతలు ఉండరాదని తెలిపామన్నారు.

● రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు నరకప్రాయంగా మారింది. వాహనాలు స్కిడ్ అవుతుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఎక్కడ చూసినా బురదగా మారింది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులకు ప్రాణ సంకటంగా మారిందని వాపోతున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● బిక్కుబిక్కుమంటున్న గిరిజన గ్రామం

ఊరి మీద పడిన రాకాసి కుక్క ● ఇద్దరిపై తీవ్రంగా దాడి



చేతిపై, పిక్కపై కరిచిన గాయం చూపిస్తున్న బాధితులు

సుండుపల్లె, జూన్9: వీధికుక్కల స్వైర విహారం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. వీధి కుక్కల సంఖ్య పెరిగిపోయి ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. సుండుపల్లె మండల కేంద్రం, పరిసర ప్రాంత గ్రామ పంచాయతీల్లోనూ పిచ్చికుక్కల బెడద ఎక్కువవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. సుండుపల్లె మండలం మడితాడు పంచాయతీ వానరాచపల్లె బిడికీలో ఆదివారం ఓ పిచ్చికుక్క ఊరిమీద పడి స్వైర విహారం చేసింది. ఇంటి నుంచి బయటికి వస్తే చాలు తన ప్రకోపాన్ని ప్రజలపై చూపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఆరుబయట కూర్చుని ఉన్న గ్రామస్తులు రోడ్లపై తిరిగే ప్రజలపై పడి పిక్కలు పీకేసింది. వానరాచపల్లికి చెందిన బుక్కే పోమే నాయక్, మూడే హనుమాన్ నాయక్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఒకరికి కాలి కండ పెరికేయగా, మరికొరికి చేతిపై పలుచోట్ల గాయపర్చింది. వెంటనే చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి గామస్తులు తరలించారు. ఆ పిచ్చికుక్క పలుకుక్కలపై దాడి చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆ కుక్క దాడి చేసిన కుక్కలకు కూడా పిచ్చిపట్టే అవకాశాలున్నాయి. వాటికి నియంత్రణ మార్గం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు పల్లెలో మహిళలు, చిన్నారులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

అక్రమాలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 9: వైవీయూ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ఐదేళ్లలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై ప్రభుత్వం విచారించి తగు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి బామ్మర్ది ఆర్కిటెక్చర్ రిజిస్ట్రారుగా అక్రమంగా కాంట్రాక్టు ఉద్యోగాలను రూ.4 నుంచి 5లక్షలతో 80కి పైగా అమ్ముకున్నాడన్నారు. బంధువులకు, నిబంధనలకు విరుద్ధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. రాజకీయ పలుకుబడితో ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో దోపిడీ చేశారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను అక్రమంగా వాడుకున్నారని మాజీ వైస్‌చాన్సలర్ రామచంద్రారెడ్డి, వీసీ సురేంద్రనాథరెడ్డి, అప్పుడు డైరెక్టరుగా ఉన్న ఎం.రామక్రిష్ణారెడ్డి వైవీయూలో కూడా వందకుపైగా ఉద్యోగాలను అమ్ముకున్నట్లు తెలిపారు. దీంతో పాటు అయా యూనివర్సిటీల్లో ఇంకా చాలా అక్రమాలు జరిగాయని, వాటన్నింటినీ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నేతలు శ్రీనాథ్‌యాదవ్, మనోజ్, వైష్ణవ్, రాహుల్, ఫాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్ గిరీకి మల్లికార్జునరెడ్డి రాజీనామా

కడప (మారుతీనగర్) జూన్ 9: ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ గిరీకి ఎ. మల్లికార్జునరెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సంబంధిత విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి చేరవేసినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చవిచూడడంతో రాజీనామా సమర్పించినట్లు వెల్లడించారు ఇదిలావుండగా 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ చైర్మన్‌గా ఎ. మల్లికార్జునరెడ్డిని నియమించాగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 9: హత్యకు సహకరించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు పేర్కొన్నారు. గత నెల 25న మంజునాధకాలనీలో పుంగనూరు శేషాద్రి అలియాస్ శేషు(32)ను ప్రత్యర్థులు గొల్లపల్లెకు చెందిన కొండుపల్లె ఆనంద్ అతని అనుచరులు కిరాతకంగా హత్య చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ కేసులో ఇప్పటికే కొండుపల్లె ఆనంద్, తుపాకుల మణికంఠ, బండి మహేష్ (విజయనగర్‌కాలనీ), సాతిపడి రాజశేఖర్(శివాజీనగర్), మొరంపల్లె చరణ్‌కుమార్‌రెడ్డి, ముసిలిచెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ చెన్నారెడ్డి(రామారావు కాలనీ), పఠాన్ నజీర్‌ఖాన్ (గౌతమీనగర్)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులైన ఏడుగురికి వాహనాన్ని ఏర్పాటు చేసిన టీకే పల్లె కాలనీకి చెందిన రుద్ర, నిందితులు పారిపోయేందుకు రూ.10 వేలు సాయం అందించిన హరిబాబును ఆదివారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధికి ఆమడదూరం వేంకటేశ్వరాలయం

● టీటీడీలో విలీనమైనా ఫలితమేదీ ● ప్రహరీకి నోచుకోని వైనం

● శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపం, కాంప్లెక్స్ ● భక్తులకు మెరుగుపడని సౌకర్యాలు

● టీటీడీ దృష్టిసారించాలని కోరుతున్న భక్తులు

జమ్మలమడుగు, జూన్ 9: డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి ప్రసిద్ధిగాంచినది. 1919లో జీర్ణోద్ధరణ చేసినప్పటి నుంచీ ఆలయం దేవాదాయ శాఖలో ఉండేది. తిరుమల తిరుపతి దేవస్థానంలోకి విలీనమైతే ఆలయం అభివృద్ధి చెందుతుందని 2008లో అప్పటి ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసి అప్పటి నేతలు విలీనం చేశారు. అయితే శ్రీనారాపురం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక చరిత్ర ఉంది. అందుకు తగ్గట్టుగా జమ్మలమడుగు ప్రాంతంలో భక్తులు అధికంగా ఉన్నారు. 2008 అక్టోబరు 23 నుంచి ఇప్పటి వరకు ఆలయానికి స్థలం ఎంత ఉందో కొలతలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. ఆలయానికి సంబంధించిన ఆస్తుల్లో భాగంగా భూములు కూడా ఉన్నట్లు భక్తులు, అధికారుల ద్వారా తెలుస్తోంది. వాటికి సంబంధించిన గుత్త డబ్బు సక్రమంగా రావడంలేదని కొందరు ఇవ్వకుండా రాజకీయం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు పాత బస్టాండు సెంటర్‌లో సుమారు 12 గదులతో ఆలయానికి సంబంధించిన కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్‌లో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వరకు కొందరు ఆలయ అధికారులతో, మరికొందరు స్థానిక నేతలతో వాటిని వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. పాత బస్టాండు ప్రధాన సెంటర్‌లో ఉంటే ఒక్కో గదికి రూ.1500 నుంచి బాడుగ ఉన్నట్లు, చాలా తక్కువ బాడుగలతో కొనసాగుతున్నాయని తెలుస్తోంది. శిథిలావస్థకు చేరినా సంబంధిత కాంప్లెక్స్‌లో అద్దెకు ఉన్నవారు కట్టకుండా ఉన్నవారు వదలుకోకుండా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అయితే మే నెలలో టీటీడీ నుంచి జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక అధికారిగా జీవీ కృష్ణారెడ్డి అధికారిగా వచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఏమేమి చర్యలు తీసుకోవాలో చర్చించారు. గ్రామంలోని మరికొందరు పెద్దలు, ఆలయ ప్రాంగణలో సమావేశం ఏర్పాటు చేసి భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు మెరుగుపడాలని కోరినట్లు తెలిసింది. అందుకు తగ్గట్టుగా టీటీడీవారు దృష్టిసారించి ఆలయ ఆస్తులపై చర్యలు తీసుకుని ఆదాయ మార్గంలో ఆలయాన్ని నడిపించేందుకు అధికారులు ముందుకు రావాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదేమైనా ఆలయ ప్రాంగణలో బయటి వ్యక్తులు పార్కింగ్ ప్రదేశంగా మార్చి ప్రైవేటు లారీలు, బస్సులు తదితర వాహనాలు నిలుపుతున్నారు. ఈ సమస్యలకు సంబంధించి జమ్మలమడుగు ఆలయ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బస్టాండులో కాంప్లెక్స్‌కు సంబంధించిన అద్దె బిల్లులు గతంలో ఆలయం వద్దకు వచ్చి చెల్లించేవారని ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణలో వాహనాలు నిలపరాదని, భక్తులకు అసౌకర్యంగా ఉంటుందని చెప్పినా ఎవరూ స్పందించడంలేదని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.



ప్రహరీలేని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



ఆలయం ఎదురుగా ఉన్న వ్యర్థాలు

ఆ ఉద్యోగుల రూటే సపరేటు

30 ఏళ్ల కిందటే ఆ శాఖ రద్దు ● పని నిల్... జీతం ఫుల్ ● వైద్యశాఖలో ఎపిడమిక్ ఉద్యోగుల వింత ధోరణి

కడప(కలెక్టరేట్), జూన్ 9: నిత్యం పేదలకు వైద్యం అందించే వైద్యశాఖలో కొందరు ఉద్యోగుల రూటే సపరేటుగా ఉంది. తెల్ల చొక్కా నలగకుండా సమయానికి ఫేస్ అటెండెన్స్ వేసుకోవడం, దర్జాగా కాలయాపన చేయడంలో వీరి స్టైలే వేరంటారు. 30 ఏళ్ల కిందటే రద్దయిన మొబైల్ యూనిట్ ఎపిడమిక్ సెల్‌లో ఉద్యోగం వారి పాలిట వరంగా మారింది. ఏ పనీ చేయకుండానే నెలకు టంచన్‌గా జీతాలు తీసుకుంటూ కాలం వెల్లదీస్తుండడంతో ఆ శాఖ ఉద్యోగుల్లోనే తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది.

వైద్యశాఖలో ఎపిడమిక్ ఉద్యోగుల వింత ధోరణి అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇతర దేశాల నుంచి వైరస్‌ల ద్వారా మనకు వ్యాపించే అంటువ్యాధులకు సంబంధించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం, అప్రమత్తం చేయడం వీరి పని. కానీ జిల్లా వైద్యశాఖ విస్తరించడం, జనాభా ప్రాతిపదికన ప్రాథమిక ఆస్పత్రులు పెరగడంతో సిబ్బంది కొరత లేదు. వీరి అవసరం లేకుండా ప్రతి పీహెచ్‌సీకి 14 మంది వైద్య సిబ్బందిని నియమించి వారి ద్వారా అంటువ్యాధుల అదుపునకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మూడు దశాబ్దాల కిందటే రాష్ట్ర వైద్యశాఖ ఎపిడమిక్ సెల్ సేవలను రద్దు చేసింది. అయితే మన జిల్లాలో మాత్రం ఈ విభాగంలో ఉద్యోగులు పనిపాట లేకుండా నెలనెలా టంచన్‌గా లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న తీరు ఆ శాఖ ఉద్యోగులను విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వం కూడా ఎపిడమిక్ సెల్ ఉద్యోగులకు ఎలాంటి వర్క్ అలాట్‌మెంట్ చేయడం లేదు. దీంతో వారు జిల్లాకు వచ్చే డీఎంఅండ్‌హెచ్‌ఓలకు, మిగతా వైద్య విభాగాధిపతులకు కింది స్థాయి ఉద్యోగుల పనితీరు ఫైళ్లపై జోక్యం చేసుకుంటూ ఉన్నతాధికారులకు లేనిపోని మాటలు చెబుతున్నారని ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఈ విభాగం ఉద్యోగుల విధుల రాష్ట్ర ఏజీ ఆడిట్ విభాగం తప్పుపడుతూ చాలా కాలంగా అభ్యంతరాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఎప్పుడో ఎపిడమిక్ సెల్ రద్దయినా మన జిల్లాలో మాత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఉద్యోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం, కూర్చోబెట్టి జీతాలు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



ఏటా కోటి పైమాటే వీరి జీతాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉండే ఎపిడమిక్ సెల్‌లో దాదాపు 14 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో ఇద్దరు ఎంపీహెచ్‌ఓలు, నలుగురు ఎంపీహెచ్‌ఈఓలు, 1 మెడాలజిస్ట్, డిప్యూటీలు 5 మంది సహా పీహెచ్‌ఓలు మరో ఇద్దరు కలిపి మొత్తం 14 మంది ఉన్నారు. వీరందరికీ నెలకు లకారాల్లోనే జీతాలు ఉండడంతో ఏటా రూ.కోటికి పైగా పనిచేయకుండానే టంచన్‌గా జీతాలు పొందుతున్నారు. ఉన్నతాధికారుల తీరును.. మిగతా ఉద్యోగులు తప్పుపడుతున్నారు. రోజూ వైద్యశాఖలో గ్రామ, గ్రామాల్లో ఆశాలు మొదలు, ఏఎన్‌ఎంలు, సెకండ్ ఏఎన్‌ఎంలు పేద ప్రజల ఆరోగ్యం, సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికీ ఫీల్డ్ విజిట్ చేస్తేనే జీతాలొస్తాయి. కానీ ఎపిడమిక్ సెల్‌లో ఉద్యోగులు మాత్రం ఏ పనీ చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని, ఉన్నతాధికారులు ప్రక్షాళన చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతుండడం గమనార్హం. దీనిపై అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా... మనకు ఎపిడమిక్ విభాగం అయితే ఉంది. ఎక్కడైనా అంటువ్యాధులు వస్తే వారు అక్కడకు వెళ్లి పరిశీలిస్తుంటారు. అంతేకానీ వారికి ప్రత్యేకంగా వర్క్ అలాట్‌మెంటు ఏమీ లేదన్నారు.

నిత్యాన్నదానానికి రూ.3,00,116 విరాళం

చక్రాయపేట, జూన్ 9: గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.3,00,116విరాళం వచ్చినట్లు ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. ఆదివారం బెంగుళూరు వాసి శ్రీనాథరెడ్డి సతీమణి హరితరెడ్డి, కుమారులు హర్షిత్‌రెడ్డి, కృతిక్‌రెడ్డి ఈ విరాళాన్ని దేవస్థాన బ్యాంకు ఖాతాకు పంపినట్లు తెలిపారు. వీరి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతోక్షేమంగా ఉండాలని పూజలు జరిపించినట్లు తెలిపారు. గండి క్షేత్రంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శనివారం రూ.3,00,116 పంపిన సురేష్‌రెడ్డి, ఆదివారం పంపిన శ్రీనాథ్‌రెడ్డి మిత్రులు కావడం విశేషం.

'టిడ్కో'కు 2024 కలిసివచ్చేనా?

ఇస్తామని ఆశలు పెట్టిన వైనం ● మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగం

టిడ్కో ఇళ్లు దక్కకుండా వైసీపీ కుట్ర ● కొత్త ప్రభుత్వమైనా గృహాలు కేటాయించేనా


జమ్మలమడుగు, జూన్ 9: ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వమైనా గృహాలను కేటాయించేనా అని లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం జమ్మలమడుగు మండలం గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన టిడ్కో గృహాలున్నాయి. 2017 ఆగస్టు 26వ తేదీ అప్పటి మంత్రి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి టిడ్కో గృహనిర్మాణం కోసం శంకుస్థాపన శిలాఫలకం వేశారు. ఆవాస్ యోజన పథకం, ఎన్టీఆర్ ఇళ్ల పథకం, టిడ్కో గృహాలను షేర్వాల్ సాంకేతికతతో నిర్మించేందుకు అప్పట్లో టీడీపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కేటాయింపులు చేసినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. రూ.60 కోట్లతో 16 ఎకరాల్లో ఎన్‌సీసీ కంపెనీకి అప్పగించారు. అప్పట్లో పనులు వేగవంతంగా జరిగి సుమారు 1440 గృహాలు పూర్తికాగా పెండింగ్‌లో 40 గృహాలకుపైగా ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. అయితే 2019లో ప్రభుత్వం మారిపోయి టిడ్కో గృహాలు లబ్ధిదారులకు పంపిణీ నిలిచిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహాల లబ్ధిదారుల పట్ల ఆ గృహాలకు సంబంధించి నిర్లక్ష్యం చేశారు. అయితే ఎన్నికలు రెండేళ్ల ఉండగా టిడ్కో లబ్ధిదారులకు ప్రభుత్వం అదిగో ఇస్తాం, ఇదిగో ఇస్తాం అంటూ ఆశలు పెట్టారు. మౌలిక వసతుల కోసం రూ.5.60 కోట్లు కేటాయింపులు జరిగి కేవలం విద్యుత్తు స్తంభాలు, మంచినీటి బోర్లు మాత్రమే వేసినట్లు, ఆగృహాలకు వైసీపీ రంగు వేశారు. టిడ్కో గృహాల సముదాయంలో సుమారు 1450 గృహాలుంటే ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కరవయ్యాయి. గృహాల చుట్టూ ముళ్లపొదలు, వ్యర్థాలు నిండుకున్నాయి. కంట్రాక్టర్ ఆ గృహాలకు కిటికీలు, తలుపులు వేయాలని ఒప్పందం చేసుకున్నట్లు, అవేమీ సక్రమంగా జరగలేదని విమర్శలున్నాయి. ఏదేమైనా వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు చెప్పిన మాట నిలబెట్టుకోలేక కనీసం మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఆ గృహాలన్నీ నిరుపయోగంగా మార్చారు. దీని వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపణలున్నాయి. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇచ్చినట్లయితే జగనన్న కాలనీల్లో స్థలాలు తీసుకోవడానికి కూడా వెనుకంజ వేస్తారేమోనని ప్రభుత్వం కుట్ర పన్నినట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. అయితే వారి కుట్ర కారణంగా టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు దక్కకుండా చేశారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే టిడ్కో లబ్ధిదారులకు 2024 కలిసి వస్తుందా అనే ప్రశ్న తలెత్తింది. వచ్చే కొత్త ప్రభుత్వంలోనైనా టిడ్కో గృహాల లబ్ధిదారులకు గృహ కేటాయింపులు జరుగుతాయా అనే ప్రశ్న ఉంది.




గూడెం చెరువులో పూర్తయిన టిడ్కో గృహాలు

అసాంఘికాలకు అడ్డాగా..

టిడ్కో గృహాల సముదాయంలో అసాంఘికాలకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. గృహాలు పూర్తయిన వైసీపీ ప్రభుత్వం రోడ్డుపై నుంచి గృహాల వద్దకు వెళ్లే దారి సిమెంటు రోడ్డుకు నోచుకోలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యమే గృహాలను నిరుపయోగంగా మార్చారని వాపోతున్నారు. రోజూ ఎప్పుడు పడితే అప్పుడు స్థానికంగా ఉన్నవారు బయటి ప్రాంతాలవారు టిడ్కో గృహాల సముదాయంలో మద్యం సేవించడం, సీసాలన్నీ అక్కడే పడవేసి వెళ్లడం, మట్కా, పేకాట రాయుళ్లకు ఆ ప్రదేశం బాగా అచ్చి వచ్చినట్లుగా చెప్పుతున్నారు. రోడ్డుకు కొంత దూరంలో ఉండడం, మనుషులు ఎవరున్నారో తెలియకపోవడం, ఎవరైనా తనిఖీకి వచ్చినా వెతికేలోపే పారిపోయేదానికి సిద్ధంగా ఉంటారని ఏది ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని విమర్శలున్నాయి.





టిడ్కో గృహాల వద్దకు వెళ్లే గ్రావెల్ రోడ్డు - గృహాల వద్ద పడేసిన మందు సీసాలు

వర్మపై దాడి.. పవన్ సీరియస్..!



- వన్నెపూడి ఘటనపై విచారణకు ఆదేశం
- కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు
- వారం రోజుల్లో పిఠాపురానికి జనసేనాని
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు
- జనసైనికులు సంయమనం పాటించాలి: నాగబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి), పిఠాపురం, జూన్ 9: పిఠాపురంలో జనసేన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన మాజీ ఎమ్మెల్యే వర్మపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన దాడిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరున్నారు..? అనే దానిపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపే బాధ్యతలను పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ అప్పగించారు. ప్రస్తుతం ఆయన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బిజీబిజీగా ఉంటారు. అనంతరం ఆయన పిఠాపురం వెళ్లి అక్కడ పరిస్థితిని చక్కదిద్దనున్నారు. ఈ లోగా సంఘటనకు కారణాలు, ఇతర అంశాలపై పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నివేదిక సిద్ధం చేయాని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగానే పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాలొన్నట్టు తెలిస్తే మాత్రం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న హెచ్చరికలు పంపించారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించది లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఇప్పటికే హెచ్చరించారు. అధినేత పవన్ కల్యాణ్ వచ్చిన తర్వాత ఘటనపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

ఘటనపై వివరాలు సేకరిస్తున్నాం: నాగబాబు

వన్నెపూడిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై జరిగిన దాడి, తదనంతర పరిణామాలు పార్టీ దృష్టికి వచ్చాయని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం తెలిపారు. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిని ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి తమకు సమాచారం ఉందని, పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక నేతలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జనసైనికులందరూ సంయమనం పాటించాలని కోరారు. సాధ్యమైనంత వరకూ తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మారు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మి ఓటు వేశారని, దీనిపై చర్చ ఎందుకని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఓడిపోవడంపై స్పందిస్తూ 'ఇది ప్రజాతీర్పు అన్నారు. ఆ తీర్పుకు శిరసా వహించాల్సిందే. సీన్ ఈజ్ ఓవర్ అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయని ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి తెలిపారని, అక్కడినుంచి నిలబడి వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఇదే తమ ప్రధాన అజెండా అని చెప్పారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గిరిజనులంతా తరలిరావాలి: ధారునాయక్

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఘనవిజయం సాధించిన కూటమి తరఫున ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. 16గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ సర్కార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గిరిజనులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో గిరిజనులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

వీసీలు స్వచ్ఛందంగా తప్పుకోవాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులందరూ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా తొలగించక ముందే స్వచ్ఛందంగా తప్పు కోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, ముఖ్యంగా ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్ వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. వర్సిటీల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంపై దృష్టి పెట్టకుండా, వర్సిటీలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారు. అత్యుత్సాహంతో వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ఘన విజయంతో అధికారం చేపడుతున్నా, ఇంకా ఏ ముఖం పెట్టుకుని, వీసీ పదవుల్లో కొనసాగుతారని మండిపడ్డారు.

బాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందాలి

- కాబోయే సీఎంకు నవీన్ పట్నాయక్ అభినందనలు

భువనేశ్వర్, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలని బీజేడీ చీఫ్, ఒడిసా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబును అభినందించారు. చంద్రబాబుతో మాట్లాడి అభినందనలు తెలియజేశానని ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన రాజకీయ జీవితంలో చంద్రబాబుతో సుదీర్ఘ అనుబంధం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించగా, వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

హైవేపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- బెంబేలెత్తిన వాహనదారులు.. కాంట్రాక్టర్ కక్కుర్తే కారణం
- కత్తిపూడి- ఒంగోలు హైవేపై తప్పిన పెను ప్రమాదం



గుడివాడ, జూన్ 9: కాంట్రాక్టర్ కక్కుర్తి ఫలితంగా ఏకంగా జాతీయ రహదారి పైనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై ఒక్కసారిగా స్తంభాలు వంగిపోవడంతో వాహనదారులు బెంబెలెత్తిపోయారు. గుడివాడ మండలం రామనపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సుమారు 11.30 గంటలకు ఒక్కొక్కటిగా 7 స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒరిగిన స్తంభాలు దాదాపుగా రహదారికి సగానికి పైగా ఆక్రమించడంతో ప్రమాదకరంగా మారాయి. కాగా, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. విద్యుత్ అధికారులు తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి వైర్లను కత్తించారు. స్తంభాలను యథావిధిగా వదిలేశారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయలేదు. దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రజలు ఆ ప్రాంతంలో బిక్కు బిక్కు మంటూ గడిపారు. ఇక, ఈ స్తంభాలను వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ నాసి రకంగా వేశారు. స్తంభాలు నిలబెట్టే క్రమంలో సరైన ఫౌండేషన్ వేయలేదు. కక్కుర్తిగా పనులు చేపట్టడంతో అవి ఒరిగిపోయాయి. కాంట్రాక్టర్ వైసీపీ ముఖ్య అనుచరుడు కావడంతో అధికారులు నోరుమెదపలేకపోయారన్న ప్రచారం సాగుతోంది.



గేట్లకు రోప్ లేకుండా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు



అసంపూర్తిగా జీడీపీ ఆనకట్ట బలోపేతం పనులు

'గాజులదిన్నె'కు గండం!

- గేట్లు పెట్టారు.. రోప్ కనెక్షన్లు మరిచారు
- వరద పోటెత్తితే గేట్లు తెరిచే అవకాశమే లేదు
- 30 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు
- మరో 'అన్నమయ్య డ్యాం' కాకముందే స్పందించాలి
- సాగునీటి నిపుణులు, రైతుల వినతులు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. జగన్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా ఇప్పటికే కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడో ప్రాజెక్టు ఉందనే ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో గాజులదిన్నె జలాశయానికీ అలాంటి ముప్పే పొంచి ఉంది. ప్రాజెక్టు ఆధునీకరణ, మరమ్మతుల్లో భాగంగా కొత్త గేట్లు బిగించారు. అయితే వాటి నిర్వహణకు వీలుగా రోప్స్, లైనాప్ ప్లేట్లు వంటివి ఏర్పాటు చేయలేదు. డ్యాం ఎగువన వర్షాలు పడుతున్నాయి. వరద పోటెత్తితే గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలలు క్రితమే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే గాజులదిన్నె కూడా అన్నమయ్య ప్రాజెక్టు తరహాలో ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లా గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఒకటి. కర్నూలు జిల్లా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ, డోన్ మండలాల్లోని పలు గ్రామాల్లో రబీ పంటలకు 24,372 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, కృష్ణగిరి, డోన్ పట్టణాలతో పాటుగా 125 గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే అందుతోంది. బండగట్టు రక్షిత మంచినీటి పథకం ద్వారా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 గ్రామాలకు పైగా తాగునీరు అందించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించారు. దీంతో జలాశయం సామర్థ్యం 7.5 టీఎంసీలకు పెంచాలనే లక్ష్యంగా రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత జగన్ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సవరించి 5.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ రూ.37 కోట్లతో ఆనకట్ట బలోపేతం, ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టారు. మరో రూ.12కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను బీఎస్‌వీ కన్‌స్ట్రక్షన్, శ్రీశ్రీ విఘ్నేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థలు దక్కించుకోగా.. విజయవాడకు చెందిన కాంట్రాక్టరు కోటిరెడ్డి సబ్ కాంట్రాక్టు తీసుకుని 2022 ఏప్రిల్ 26న పనులు చేపట్టారు.

భారీ వరదొస్తే తిప్పలే

గాజులదిన్నె ప్రాజెక్టు ఆరు గేట్ల డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. ఈ గేట్లకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టాయి. నిర్వహణ కష్టంగా మారింది. కొత్త గేట్ల ఏర్పాటులో భాగంగా 2023 సెప్టెంబరులోనే ఫ్యాబ్రికేషన్ (తయారీ), ఎరక్షన్ (పాతవాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం) వంటి పనులు పూర్తి చేశారు. వాటిని కిందకు, పైకి ఎత్తేందుకు(లిఫ్ట్) వీలుగా రోప్ కనెక్షన్లు, లైనాప్‌ప్లేట్స్ వంటి కీలకమైన పనులు చేయాల్సి ఉంది. చిన్న పనులే అయినా గేట్ల నిర్వహణలో ఇవే కీలకం. ఆనకట్ట బలోపేతం, గేట్ల ఏర్పాటు పనులకు దాదాపు రూ.30 కోట్ల మేర బిల్లుల చెల్లింపునకు జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయలేనంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. కాగా ఆదివారం (9వ తేదీ) నాటికే 97.9 మి.మీ. కురిసింది. 3శాతం అధిక వర్షపాతం నమోదైంది. జలాశయం ఎగువన పత్తికొండ మండలంలో 89.9 మి.మీ.కు గానూ 154.6 మి.మీ. (72% అధికం), ఆలూరు ప్రాంతంలో 77.5 మి.మీ.కు గానూ 108.2 మి.మీ.(40% అధికం), మద్దికెర మండలంలో 70.2 మి.మీ.కు గానూ 77.4 మిల్లీమీటర్లు (10% అధికం) వర్షం పడింది. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అదే జరిగితే డ్యాంకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ దాటి వరద పోటెత్తితే గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కొత్తగేట్లకు రోప్స్, లైనాప్ ప్లేట్ల పనులు చేయకపోవడంతో ఆనకట్టకు గండి కొట్టకపోతే కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కడప జిల్లాలో 2022 నవంబరులో అధిక వరద అన్నమయ్య ప్రాజెక్టుకు పోటెత్తడంతో ఒక గేటు రోప్ తెగిపోయి అడ్డంగా ఇరుక్కుపోవడంతో పైకి ఎత్తలేని పరిస్థితి. సామర్థ్యానికి మించి వరద రావడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితులు రాకముందే గాజలదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నిర్వహణకు అనుకూలంగా రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేట్లు

తక్షణమే మరమ్మతులు చేపడతాం

గాజులదిన్నె ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. రోప్స్ లైనాప్ ప్లేట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వరదలు వస్తే ఆనకట్టకు ప్రమాదం ఉన్న మాట నిజమే. కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి తక్షణమే మిగిలిన పనులు చేయిస్తాం. ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- కబీర్‌బాషా, సీఈ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కర్నూలు



వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 99 కోట్లు

- అసెంబ్లీలో 79% మంది నేరచరితులే
- 138 మందిపై క్రిమినల్ కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాజాగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలలో 138 (79%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 98 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎమ్మెల్యేల్లో 162 మంది సంపన్నులు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 174 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ శనివారం ఓ నివేదిక విడుదల చేసింది. టీడీపీ తరఫున పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూర రెడ్డి అఫిడవిట్‌ను విశ్లేషించలేదు. 2019లో ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో 96 (55%) మందిపై క్రిమినల్ కేసులుండగా ఈసారి వారి సంఖ్య మరింత పెరిగింది. ముగ్గురిపై హత్య, 32మందిపై హత్యయత్నం కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. 22మందిపై మహిళలపై దాడులకు పాల్పడిన కేసులు ఉండగా, ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదైంది. పార్టీలవారీగా చూస్తే టీడీపీ తరఫున గెలిచిన 134మంది ఎమ్మెల్యేలలో 115 మంది, బీజేపీ టికెట్‌పై గెలిచిన 8 మంది, జనసేన తరఫున విజయం దక్కించుకున్న 10 మంది, వైసీపీ తరఫున గెలిచిన ఆరుగురిపై క్రిమినల్ కేసు లున్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులు నమోదైన వారిలో టీడీపీలో 82మంది, బీజేపీలో ఐదుగురు, జనసేనలో ఏడుగురు, వైసీపీలో నలుగురు ఉన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల ఆస్తులే ఎక్కువ

గత అసెంబ్లీ ఎన్నికలలో 163 మంది కోటీశ్వరులు గెలవగా ఈసారి 162మంది గెలిచారు. టీడీపీలో 127, జనసేనలో 18, వైసీపీలో 9, బీజేపీలో 8 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ ఈసారి రూ.65.07 కోట్లు ఉండగా, గత అసెంబ్లీలో రూ.27.87 కోట్లుగా ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.67.97 కోట్లు ఉండగా, వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.99.19 కోట్లుగా ఉంది. బీజేపీ శాసనసభ్యుల సగటు ఆస్తుల విలువ రూ.34.29 కోట్లు, జనసేన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.40.43 కోట్లుగా ఉంది.

- టీడీపీ అధినేత చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తితో అగ్రస్థానంలో ఉన్నారు. రెండోస్థానంలో నారాయణ రూ.824 కోట్లు, వైఎస్ జగన్ రూ.757 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.
- మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజుకు అందరికంటే అతి తక్కువగా రూ.12 లక్షల ఆస్తి ఉంది.
- రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష రూ.19 లక్షలు, కర్నూల్ ఎమ్మెల్యే జయసూర్యకు రూ.21 లక్షల ఆస్తులున్నాయి.
- పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ కుటుంబ ఆదాయం దాదాపు రూ.73 కోట్లు ఉంది.
- విద్యార్హతల వారీగా చూస్తే.. 49 మంది ఎమ్మెల్యేలు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.
- 122 మంది డిగ్రీ ఆపై ఉన్నత విద్యావంతులు. ముగ్గురు డిప్లొమా చేశారు.
- వయసుల వారీగా చూస్తే.. 12 మంది 25-40 ఏళ్ల మధ్య, 118 మంది 41-60 ఏళ్ల మధ్య, 43 మంది 61-80 ఏళ్ల మధ్య ఉన్నారు. ఒక ఎమ్మెల్యే వయసు 82 ఏళ్లు.

సీఐడీ ఆధీనంలో 'బేవరేజెస్'

- కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు
- ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో జరిగిన అవకతవలను నిగ్గుతేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. రెండు రోజులుగా విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు చేస్తోంది. బేవరేజెస్ ఎండీ కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీయే లక్ష్యంగా ప్రభుత్వ షాపుల ద్వారా అమ్మకాలు సాగించి, కమీషన్లు కొల్లగొట్టిన వైనంపై విచారణ చేస్తోంది. ఇష్టానుసారం ధరలు పెంచేసి, కమీషన్ల రూపంలో వేల కోట్లు దండుకున్న వ్యవహారంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఐదు అంతస్తులున్న భవనంలో మొదటి రెండు ఫ్లోర్లు ఎక్సైజ్ కార్యాలయంగా వాడుకుంటున్నారు. పై మూడంతస్తులు కార్పొరేషన్‌కు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయానికి వచ్చి ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందడంతో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సీఐడీ సోదాలు చేపట్టింది. అక్కడినుంచి వచ్చిన తర్వాత బేవరేజెస్ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. బయట పోలీసుల్ని కాపలా పెట్టి సీఐడీ అధికారులు లోపల సోదాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో ఒక బాక్సు(కేసు) లిక్కర్‌పై రూ.250, బీరు కేసుపై రూ.150 చొప్పున వసూళ్లు చేసినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోట్ల కేసులకు తగ్గకుండా ఐదేళ్లలో 20 కోట్ల కేసుల మద్యం విక్రయించి వేల కోట్లు దండుకున్న అక్రమార్కులను గుర్తించే పనిలో ఉన్నారు. కమీషన్ల రూపంలో దోచుకున్న వేల కోట్లలో జగన్‌కు వాటా వెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆ డబ్బు దాచి, అందులో కొంత ఎన్నికల్లో ఖర్చు చేశారని, మిగిలిన డబ్బంతా బెంగళూరుకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 అక్టోబరులో ప్రభుత్వ మద్యం షాపుల్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3500 మద్యం షాపులను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్యం షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని మద్యం కంపెనీలకు వైసీపీ పెద్దలతో ప్రతిపాదన పెట్టించింది. ఇందుకు కంపెనీలు అంగీకరించలేదు. దీంతో... 'మీకు నష్టం జరగకుండా మద్యం ధర పెంచుతాం. ఆ పెంచిన ధరను తిరిగి కమీషన్ రూపంలో ఇవ్వండి' అనే విధానం తెచ్చారు. అందుకు కొన్ని కంపెనీలు అంగీకరించాయి. ప్రముఖ బ్రాండ్ల ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో ఆయా కంపెనీల బ్రాండ్లను షాపుల్లో విక్రయించడం ఆపేశారు. 2020 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వ మద్యం షాపుల్లో జగనన్న బ్రాండ్లను విక్రయించింది. అలా అమ్మిన ప్రతి లిక్కర్ కేసు నుంచి వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. గత ఐదేళ్లలో అమ్ముడైన లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు వ్యవహారాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ చేయడంతో దుకాణాన్ని బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ పెద్దల సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత అనేక మంది వచ్చారు. సీఐడీ వీరందరికీ నోటీసులు పంపి విచారించే అవకాశం ఉంది. మద్యం బాటిళ్ల కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా 5 వేల కోట్లకు పైగానే దోపిడీ చేసినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాల్లో ఎంత తేడా...

మేన్షన్ హౌస్ బ్రాందీ 180మి.లీ. క్వార్టర్ బాటిల్ కేసు (48 సీసాలు) ఏపీ బేవరేజెస్ కంపెనీల నుంచి రూ.1697కు కొనుగోలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం దాన్ని రూ.1094కు తీసుకుంది. అంటే ఓ కేసు ధరలో వ్యత్యాసం రూ.603. ఈ మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు అనధికారికంగా చేరినట్టు ఆరోపణలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.220కి విక్రయించగా, తెలంగాణలో రూ.170కే అమ్మారు. ఇలా పేదలకు అధిక ధరలకు మద్యం అంటగట్టి వేల కోట్లు వెనకేసుకున్నారు.


వాసుదేవరెడ్డి నుంచి సజ్జల దాకా..

జగన్ పాలనలో మద్యం దోపిడీ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలువురు కీలకంగా పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకు మాత్రమే ఎండీ వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డర్లు వెళ్లేవి. తమకెందుకు ఇవ్వరని ఇతర ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తే.. ఏదో మమ అనిపించేవారు. ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, వాటిని ఎవరూ కొనట్లేదని వెనక్కి పంపేవారు. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలన్నది సజ్జల రామకృష్ణారెడ్డి నిర్ణయించేవారు. ప్రతిరోజూ ఉదయం సజ్జల నుంచి బ్రాండ్ల చార్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు వెళ్లేది. ఆయన దాన్ని మద్యం డిపో మేనేజర్లు, షాపుల్లో సేల్స్‌మెన్‌కు పంపేవారు. దాని ప్రకారం మద్యం విక్రయించేవారు. మద్యం కంపెనీలకు బకాయిల విడుదల వ్యవహారాలను కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన వేణుగోపాల్ చూసేవారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ తీసుకుని బకాయిలు విడుదల చేసేవారు. మరో రిటైర్డ్ అధికారి శ్రీనివాసరెడ్డి 3నెలలుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా కంపెనీల నుంచి గ్రౌండింగ్ చార్జీలు వసూలు చేశారు.

బెట్టింగులే బలిగొన్నాయా?!

- అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడి మృతి
- ఎన్నికల ఫలితాల రోజు నుంచి అజ్ఞాతంలోనే..

నూజివీడు టౌన్, జూన్ 9: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పుదిగవల్లి వైసీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి ఆదివారం అనుమానాస్పద స్థితిలో తన మామిడి తోటలోని షెడ్డు వద్ద మృతి చెందారు. తూర్పు దిగవల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భర్త అయిన వేణుగోపాలరెడ్డి ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల గెలుపు, ఓటములపై పలు బెట్టింగ్‌లకు మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. దాంతో పాటు తాను సైతం భారీగా బెట్టింగులు కాసి డబ్బు కోల్పోయినట్టు చెప్పుకొంటున్నారు. దాదాపు 30 కోట్ల రూపాయల వరకు ఎన్నికల బెట్టింగుల్లో మధ్యవర్తిగా లేదా ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు నుంచి వేణుగోపాలరెడ్డి కుటుంబ సభ్యులు కనిపించలేదు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం పలువురు పందెం రాయుళ్లు వేణుగోపాలరెడ్డి ఇంటిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున అతడు తన మామిడి తోటలోని షెడ్డు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డి



జిమ్‌కు తిరిగి ఎన్‌టీఆర్ పేరు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, సాయి తదితరులు

మళ్లీ 'ఎన్టీఆర్ జిమ్'గా..

- గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- వందలాదిగా పాల్గొన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు
- 'ఎన్టీఆర్'ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: బ్రాహ్మణ చైతన్య వేదిక

గుంటూరు, జూన్ 9: గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ జిమ్ పేర్లను మార్చేందుకు గత వైసీపీ పాలకులు చేసిన కుట్రలను బ్రాహ్మణ చైతన్య వేదిక భగ్నం చేసింది. ఆ మేరకు స్టేడియంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ధ్వంసం చేశారు. స్టేడియంలోని జిమ్ నూతన భవనంపై 'ఎన్టీఆర్ జిమ్' అంటూ భారీ అక్షరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ఎవరైనా అన్న ఎన్టీఆర్ పేరును టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ స్టేడియంను వైఎస్సార్ స్టేడియంగా పేరు మార్చేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులతో అధికారులు కుట్రపన్నారన్నారు. అందుకోసమే స్టేడియంలో నూతన భవన నిర్మాణం చేపట్టి వైఎస్సార్ జిమ్‌గా పేరు పెట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దీనిపై తాము హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, అయినా.. మున్సిపల్ అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిర్మాణ పనులు ఆపకుండా అక్రమంగా కొనసాగించారని విమర్శించారు. హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉన్నా, ఎన్నికల కోడ్ ఉన్నా అప్పటి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు వైఎస్సార్ పేరుతో శిలాఫలకాలు ప్రారంభించేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. దీనిపైనా తాను హైకోర్టులో మరో పిల్ వేయగా వైసీపీ ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.49 లక్షలు కేటాయించినట్లుగా చూపి ప్రజాధనాన్ని నొక్కేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే ఆడిట్ జరిపించి ఆ డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

బలమైన ప్రతిపక్షంతోనే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం!

- వచ్చే ఐదేళ్లు కేంద్రంలో మంచి పాలన: రజినీకాంత్
- చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి వెళతానని వెల్లడి



చెన్నై, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బలమైన ప్రతిపక్షాన్ని ప్రజలు ఎన్నుకొన్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతమని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లు కేంద్రంలో ఎలాంటి పాలన ఉంటుందని భావిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, మంచి పాలన ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ఘనతను మోదీ సాధించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి తనను ఆహ్వానిస్తే తప్పకుండా హాజరవుతానని రజినీకాంత్ తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. **జ్యోతి శ్రీవాస్తవ** పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారు. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్స్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్స్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్స్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నిటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

> **ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.**



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ విత‌వుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష ఆత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్, ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పండం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

నవ్య | చిత్రజ్యోతి

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహా'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.

తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మకల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.

భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు. తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.




క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




Printed and published by *Koganti Venkata Seshagiri Rao*, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at AamodaPress survey No. 137&138/3, Chinnamachupalli (V), Chennuru (M) Kadapa-516162, Ph.No.08562 201116,201117. Editor : *K.Srinivas*, RNI.No.-APTEL/2003/11850 **Managing Director : Vemuri Radha Krishna**, Founder : K.L.N.Prasad.


Happy Birthday
నందమూరి
బాలకృష్ణ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
GREEN METRO MOVIES ప్రొడ్యూసర్
బొడ్డు రవిశంకర్‌రావు అధ్యక్షులు
కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ


నందమూరి వంశాంకురం..
తారకరాముని అంశాంకురం..
నటసింహం.. రాజకీయ రణసింహం..
అన్స్టాపబుల్ అన్న మాటకి అసలైన నిదర్శనం..
ఎవర్ గ్రీన్ అన్న పదానికి నిండైన ప్రతిరూపం..
నిక్కచ్చికీ నిజాయితీకి నిలువెత్తు నిజరూపం..
కథానాయకుడి నుంచి మహానాయకుడై
ఎదిగిన విశ్వరూపం..
తెలుగు అక్షరానికున్నంత అందం..
తెలుగు భాషకున్నంత దర్పం..
కలబోసి వెలుగుతున్న తెలుగుతేజం..
సినిమారంగంలో ఉండి
తొలి హ్యాట్రిక్ శాసనసభ్యులు...
నందమూరి బాలకృష్ణ గారికి
జన్మదిన శుభాకాంక్షలు..
- WITH BEST WISHES -
KOMMINENI VENKATESWARA RAO
KANAKADURGA ARTS
B. SUDHAKAR NAIDU
KURNOOL
D. RAKESH CHOUDARY
TIRUPATI


ఈ చిత్రం ముగింపు ఎవ్వరికీ చెప్పవద్దు!
NVR CINEMA
PASSION STUDIOS
think
నా పేరు "మహారాజ"
నేను సెలూన్ షాపు నడుపుతున్నాను
నా "లక్ష్మి" పోయిందని పోలీస్ కేసు పెట్టాను
ఎవరా "లక్ష్మి" తెలుసుకోవాలంటే
తప్పక చూడండి!
విజయ్ సేతుపతి ప్రతిష్ఠాత్మక 50వ చిత్రం
మహారాజ
IN THEATRES
JUNE 14TH
NITHILAN SAMINATHAN
IN TELUGU & TAMIL
NETFLIX
ANDHRA PRADESH & TELANGANA RELEASE BY : NVR CINEMA - 79895 67742, 99669 63111


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS PRESENTS
FORTUNE FOUR CINEMAS
TEAM
NBK 109
ముచ్చటగా మూడోసారి అత్యంత భారీ మెజారిటీతో
అఖండ విజయం సాధించిన
మా నందమూరి బాలకృష్ణ గారికిశుభాకాంక్షలు
SMOKING IS INJURIOUS TO HEALTH

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | Tirupathi | Kadapa | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి సిటీ

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 18వ ర్యాంకు


ప్రభాకర్‌రెడ్డి

చిన్నమండెం, జూన్ 9: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డి, ఈశ్వరమ్మ దంపతుల రెండవ కుమారుడు కుమారకాల్వ ప్రభాకర్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఈడబ్ల్యుసీ ప్రకారం ఆల్‌ఇండియాలో 18వ ర్యాంకు సాధించాడు. కాగా 278 మార్కులు సాధించి ఆలిండియాలో 227వ ర్యాంకు సాధించారు. దేశంలోనే పేరు గాంచిన ముంబాయి ఐఐటీ కాలేజీలో సీటు దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. తాను ఎప్పటి నుంచో ముంబాయి ఐఐటీలో చదవాలనే కల అతి త్వరలో నెరవేరబోతోందని ప్రభాకర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మా తల్లిదండ్రులు వ్యవసాయం చేసి తనను చదివిస్తున్నారని, తాను ఎప్పటికైనా గొప్ప సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి మా తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొస్తానని ఆయన చెప్పుకొచ్చారు. తమ కుమారుడు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించడంపై వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోరని అఘాయిత్యం

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ప్రేమికులిద్దరూ మృతి

● మొదట ప్రియురాలు.. అనంతరం ప్రియుడు మృతి


నరేంద్ర మృతదేహం


మృతి చెందిన రాణి (ఫైల్)

ములకలచెరువు, జూన్ 8: ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేరని ప్రేమికులు బలన్మరణానికి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం దేవళచెరువుకు చెందిన మెడిమి నరేంద్ర (24), వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన రాణి ప్రేమించుకుంటున్నారు. వేపూరికోటలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న నరేంద్ర అక్కడ పని మానేసి బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గత నెల 12వ తేదీ స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. వారిద్దరి కులాలు వేరు కావడంతో తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన నరేంద్ర, రాణి ఈనెల 7వ తేదీ ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సంద్రడవిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరకుని అపస్మారక స్థితిలో ఉన్న ప్రేమికులిద్దరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి నుంచి రాణిని తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. అలాగే మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేంద్ర కూడా ఆదివారం ఉదయం మృతి చెందాడు. పెద్దతిప్పసముద్రం మండల పరిధిలో ఈ ఘటన జరగడంతో ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమికులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడడంతో వారి స్వగ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామాలకు తరలించారు.

పుల్లగూరగండిలో పడి విద్యార్థి మృతి


మృతి చెందిన అద్నాన్

రాయచోటి టౌన్/వీరబల్లి, జూన్ 9: వీరబల్లి మండలంలో గల పుల్లగూరగండిలోని నీటి గుంటలో పడి ప్రమాదవశాత్తు అద్నాన్ (15) మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. రాయచోటి పట్టణంలోని నాయబ్‌సాబ్‌వీధికి చెందిన టైలర్ షకీల్ కుటుంబం ఆదివారం సెలవురోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన విద్యార్థి అద్నాన్ భోజనం అనంతరం చేయి కడుక్కునేందుకు నీటి గుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందడంతో షకీల్ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు రాయచోటి పట్టణంలో పదో తరగతి చదువుతున్నాడు. టైలర్ షకీల్‌కు నలుగురు పిల్లలుండగా అందులో పెద్ద కొడుకుని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పుల్లగూరగండిలో ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న వీరబల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరు భూఆక్రమణలపై సీఐడీ విచారణ

● జాతీయ రహదారి పనుల పేరుతో జరిగిన విధ్వంసాలపై విజిలెన్స్

● పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టీకరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 9: పీలేరులో రూ.వేల కోట్ల విలువైన వందలాది ఎకరాల భూముల ఆక్రమణలపై సీఐడీతో విచారణ చేయించనున్నట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలు మంత్రి అండదండలతో విలువైన ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించారని, అందులో చాలా భూములు ఇళ్ల స్థలాల పేరుతో అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన నగరిపల్లెలో ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల భూదందాలకు సంబంధించి అప్పట్లో తాను పూర్తి ఆధారాలతో వెల్లడించినట్లు గుర్తు చేశారు. దీనిపైన ఐఏఎస్ అధికారిణి విచారణ జరిపి ఆరోపణలన్నీ వాస్తవమేనని తేల్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ భూములుగా అధికారికంగా గుర్తించిన వాటికి జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్‌వోసీలు జారీ చేయించారని వివరించారు. జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువైన ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ భూముల్లో బినామీ పట్టాలు మంజూరు చేయించి దురాక్రమణకు పాల్పడ్డారని కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలు పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. వీటన్నిటి పైనా సీఐడీతో సమగ్ర విచారణ చేయించనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం పూర్తి కాగానే పీలేరు, కలికిరిలో జరిగిన ఇళ్ల స్థలాల ఆక్రమణలు, వాటి నిర్మాణాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతామన్నారు. పీలేరు పట్టణంలో దాదాపు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ జరిగిందంటున్నారని, పట్టా కాగితాలు తూకం లెక్కన అమ్ముకున్నారని విమర్శించారు. ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు పెట్టాలని ప్రయత్నిస్తుంటే వాటిని ఇళ్ల స్థలాల పేరుతో అమ్ముకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలన్నీ బినామీవేనని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఆక్రమించిన విలువైన భూముల్లో ఇవ్వాలని తాను మొదటి నుంచి డిమాండు చేస్తున్నానని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో రెవెన్యూ అధికారులు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.

జాతీయ రహదారి నిర్మాణం

పేరుతో విధ్వంసం

నాలుగు లేన్ల జాతీయ రహదారి పనుల పేరుతో ప్రకృతి వనరులను విధ్వంసం చేశారని ఆరోపించారు. పనుల కోసం అక్రమంగా ఇసుక తరలించారని, చెరువులు, కొండలు, గుట్టలను ఇష్టానుసారం ధ్వంసం చేశారని చెప్పారు. రహదారి పనులు ముఖ్యమే అయినా చెరువుల్లో మట్టి కోసం ఇరిగేషన్ శాఖ నుంచి, కొండలు గుట్టల కోసం రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ నిబంధనలేవీ పాటించకుండా ఎమ్మెల్యే, ఎంపీలు దళారీలను ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలతో చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

మైనింగ్ కోసం

తమిళనాడులో బ్రోకరింగ్ ఆఫీసు

మైనింగ్ పేరుతో జిల్లాలో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారని, దీనికోసం తమిళనాడు సరిహద్దుల్లో ఒక బ్రోకరింగ్ కార్యాలయాన్నే ఏర్పాటు చేసి ప్రైవేటు మైనింగ్ సంస్థల నుంచి భారీగా వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇందులో ప్రభుత్వానికి చెల్లించినది ఎంత, వీళ్లు దిగమింగినదెంత అనే విషయం తేలాల్సి ఉందన్నారు. మంత్రి పేరుతో మైనింగ్ డైరెక్టర్లు వసూళ్లకు తెగపడ్డారని విమర్శించారు. మైనింగ్, మద్యంపై ప్రభుత్వం విచారణ చేయిస్తుందని తెలిపారు. సమావేశంలో కిశోర్‌కుమార్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథ రెడ్డి, చంద్రశేఖర్, బోడేషాపల్లి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో కిలో టమోటా రూ.60

మదనపల్లె టౌన్, జూన్ 9: మదనపల్లె టమోటా మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో రూ.60 ధర పలికింది. ఆదివారం మదనపల్లె టమోటా మార్కెట్‌కు 597 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా బహిరంగ వేలంలో మొదటి రకం టమోటా గరిష్ఠంగా కిలో రూ.60 పలకగా, కనిష్ఠంగా కిలో రూ.50 పలికింది. అదేవిధంగా రెండో రకం టమోటా కిలో గరిష్ఠంగా రూ.48 పలకగా కనిష్ఠంగా కిలో రూ.36 ధర పలికింది. గత నెల ఆంధ్రజ్యోతిలో టమోటా ధరలు పైపైకి అన్న శీర్షికన ప్రచురితమైన కథనం నిజమని తెలుస్తోంది. ఉత్తర భారతదేశంలోని పంజాబ్, రాజస్థాన్, ప్రాంతాల్లో టమోటా సీజన్ ముగియడంతో అక్కడి వ్యాపారులు దక్షిణ రాష్ట్రాల వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లె, కోలారు టమోటా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో ఈ సీజన్‌కు టమోటా టాప్ ధర కిలో 60 పలికింది. రాబోయే రోజుల్లో టమోటా కిలో రూ.100 ధర పలికినా ఆశ్చర్యపోనవసరం లేదు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జూన్ 9: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్య కైంకర్యాల అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణ చేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల నడుమ కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బురకాయలకోటలో టీడీపీ కార్యకర్తలపై దాడి

ఓ పత్రికా రిపోర్టర్‌తోపాటు ముగ్గురిపై కేసు నమోదు



దాడిలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త వెంకటేష్ రాజును పరామర్శిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూన్ 8: ములకలచెరువు మండలంలోని బురకాయలకోటలో శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలతో కలిసి ఓ పత్రికా రిపోర్టర్ (ఆంధ్రజ్యోతి కాదు) దాడికి తెగబడ్డాడు. దీనిపై పోలీసులు రిపోర్టర్‌తో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్థుల కథనం మేరకు...బురకాయలకోట బస్టాండుతో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు చేసుకునేందుకు పలురువు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో చర్చించుకునేందుకు కలిశారు. ఈ క్రమంలో ఓ పత్రికా రిపోర్టర్ కేపీ ఖాజావలి, అతని అనుచరులు భరత్, భాను తదితరులు అక్కడికి చేరుకుని టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగి నానా దుర్భషలాడారు. అంతటితో ఆగకుండా కట్టెలు, ఇనుప రాడ్లతో దాడికి తెగబడ్డారు. మా గ్రామంలోనే టీడీపీ జెండాలు కడతారా అంటూ దాడి చేశారు. ఈ దాడిలో పెద్దరాజులపల్లెకు చెందిన వెంకటేష్‌రాజుపై కట్టెతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరో కార్యకర్తకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ తిప్పేస్వామి తీవ్రంగా గాయపడ్డ టీడీపీ కార్యకర్తను చికిత్సల నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రిపోర్టర్ ఖాజావలితో పాటు వైసీపీ కార్యకర్తలు భరత్, భానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కాగా తీవ్రంగా గాయపడ్డ టీడీపీ కార్యకర్తను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, టీడీపీ నేతలు ముత్తుకూరు మౌళా, రామకృష్ణమరాజు, గోపాల్‌రాజు, గాండ్ల రెడ్డెప్ప తదితరులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 9హత్య చేసి వచ్చిన నిందితులకు సహకారం అందించిన ఇద్దరు నింతులను అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ యువరాజు పేర్కొన్నారు. గత నెల 25న తెల్లవారుజామున పట్టణంలోని శ్రీవారినగర్ సమీపంలోని మంజునాధకాలనీలో పుంగనూరు శేషాద్రి అలియాస్ శేషు(32)ను ప్రత్యర్థులు పట్టణంలోని గొల్లపల్లెకు చెందిన కొండుపల్లె ఆనంద్ అతని అనుచరులు కిరాతకంగా హత్య చేసిన విషయం పాఠకులకు విధితమే. ఈ కేసులో ఇప్పటికే కొండుపల్లె ఆనంద్(35)తోపాటు పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన తుపాకుల మణికంఠ (23), బండి మహేష్(28), శివాజీ నగర్‌కు చెందిన సాతిపడి రాజశేఖర్ (40), రామారావు కాలనీకి చెందిన మొరంపల్లె చరణ్‌కుమార్‌రెడ్డి (23), ముసిలిచెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ చెన్నారెడ్డి (28), గౌతమీనగర్‌కు చెందిన పఠాన్ నజీర్‌ఖాన్ (27)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులైన ఏడుగురికి వాహనాన్ని ఏర్పాటు చేసిన బీకే పల్లె కాలనీకి చెందిన రుద్ర (27), నిందితులు పారిపోయేందుకు రూ.10 వేలు సాయం అందించిన హరిబాబు (37)లను ఆదివారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రెడ్డెమ్మకొండ ఆలయ చైర్మన్ రాజీనామా

గుర్రంకొండ, జూన్ 9:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయ చైర్మన్ టి.నరసింహారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు ఈవో మంజుల తెలిపారు. రెడ్డెమ్మకొండ ఆలయం చైర్మన్‌గా టినరసింహారెడ్డి రెండోసారి పదవీ బాధ్యతలను కొన్ని నెలల క్రితం చేపట్టాడు. ఈ క్రమంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓటమి చెందిన విషయం తెలిసిందే. దీంతో చైర్మన్ పదవికి ఆదివారం రాజీనామా చేసినట్లు ఈవో తెలిపారు. దీంతో అమ్మవారి ఆలయానికి కొత్త చైర్మన్ ఎవరన్నదీ త్వర్లో టీడీపీ అధిష్ఠానం నిర్ణయించనున్నది.

తంబళ్లపల్లె ఇన్‌చార్జిగా శంకర్‌యాదవ్‌ను నియమించాలి

పెద్దతిప్పసముద్రం జూన్ 9 : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా శంకర్‌యాదవ్‌కే బాధ్యతలు అప్పగించాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు కోరారు. ఈసందర్భంగా ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లెలో పార్టీకి పూర్వ వైభవం రావాలంటే ఖచ్చితంగా శంకర్‌యాదవ్‌కే టికెట్ కేటాయించే విధంగా పునరాలోచించాలని ఆయన ఆదిష్ఠానాన్ని కోరారు. ఈ రోజు తంబళ్లపల్లె నియోజకవర్గంలో సునాయసంగా టీడీపీ పార్టీ గెలిచే స్థానాన్ని కేవలం 3 నెలల ముందు ప్రజల్లోకి వచ్చిన అభ్యర్థి జయచంద్రారెడ్డికి కేటాయించడంతో పార్టీ కేడర్ తెలియని అయన టీడీపీ విజయం కోసం పని చేయకుండా ఏ కార్యకర్తను, ఏ నాయకున్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. కనీసం 6 మండలాల్లో పోల్ మేనేజ్‌మెంట్ చేయకుండా పోలింగ్ కు రెండు రోజులు ముందు చేతులెత్తేశాడన్నారు. ఇప్పుడు దాని పలితమే తంబళ్లపల్లె నియోజక వర్గంలో 47 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఎజెంట్లను సైతం పెట్టలేక పోయాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు విజయం సాదిస్తుంటే తంబళ్లపల్లెలో మాత్రం కూటమి ఓటమి పాలైందన్నారు.

కొనసాగుతున్న విజయోత్సవాలు



పెద్దతిప్పసముద్రం జూన్ 9 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అఖండ విజయం సాదించి స్వర్ణాంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టబో తున్న సందర్భంగా మండలంలోని కాట్నగల్లు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యక ర్తలు విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించు కున్నారు. కాట్నగల్లు గ్రామంలోని నడిబోడ్డున బారీ కేక్ కట్ చేసి కూటమి నాయకులు, కార్యకర్తలందరు పంచి పెట్టి పరస్పరం అభినందనలు తెలియచేసుకున్నారు. ఈ సందర్భంగా జై నరేంద్ర మోదీ జై, జైజై చంద్ర బాబు, జైలోకేశ్, జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు మిన్నంటాయి. జేసీ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటు ముక్త కంఠంతో నినదించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మార్యారి ఆంజనేయరెడ్డి, మంత్రి ప్రసాద్ రెడ్డి, పి. మస్తాన్‌రెడ్డి, జేసీఆర్ పీఏ రాజేష్‌రెడ్డి, పీవీ వెంకటరెడ్డి, పెద్దపొంగు౼ఎల్లె అంజీ, స్థానిక నాయకులు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, కాట్నగల్లు ఆనంద్‌రెడ్డి, బూచిపల్లె భాస్కర్‌రెడ్డి, బీవీ వెంకటాచారి, కుక్కల రమణ, బూచిపల్లె నాగరాజాచారి, కాకిమారిపల్లె శేఖర్‌రెడ్డి, మహేష్, హరీష్, కృష్ణారెడ్డి, పెద్దిగాల రమణ, జనసేన రవిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోదీతోనే దేశ ప్రగతి సాధ్యం

● వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కూటమి నేతల సంబరాలు



తంబళ్లపల్లెలో సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు



ములకలచెరువులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

తంబళ్లపల్లె, జూన్ 9: దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. భారతదేశ ప్రధానిగా మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య, అసెంబ్లీ కోకన్వీనర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఆదివారం కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టి సంబరాల్లో మునిగిపోయారు. అనంతరం కూటమి నాయకులు మాట్లాడుతూ...టీడీపీ, బీజేపీ, జనసేన సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, శంకర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, అప్పిరెడ్డి, రఘునా థరెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బయ్య, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు రాజేంద్ర నాయక్, టీడీపీ నాయకులు శశిధర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, మ్యూజికల్‌శివ, చెట్లవారిపల్లె మధు, అశోక్, రామచంద్ర, రమణారెడ్డి, జగదీష్, వీరాంజినేయులు, తెలుగుయువత మధుసూదన్, పీర్లమాబు, మల్లేష్, శివకు మార్, నాగభూషణం, మురళి, రాజారెడ్డి, మునాఫ్ పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలోని బురకాయలకోటలో ఆదివారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, గోపాల్‌రాజు, మస్తాన్‌రెడ్డి, కేవవరెడ్డి, ఫజురుల్లా, తిప్పరాజు, బీజేపీ నాయకులు నాగరాజు, రామకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జనసేన నాయకులు రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంకొండలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

గుర్రంకొండలో:దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి వరుసగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గుర్రంకొండలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా బస్టాండులో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, రామాంజులు, చలమారెడ్డి, సతీష్, మేకల చలపతి, రాము, సుధాకర్, భరత్, దేవిక, మహాత్మారెడ్డి, సుబ్బరాజు, రఘు, భాస్కర్, తన్వీర్, మౌలా, రమణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన మనోజ్‌జయంత్‌రెడ్డి



చంద్రబాబునాయుడితో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ నేత మనోజ్ జయంత్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 9 : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనాయ కుడు ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తనయుడు మనోజ్ జయంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలిశారు. దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు నాయుడును మనోజ్‌జయంత్‌రెడ్డి ఢిల్లీలో కలిసి మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవ ర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు అదే విధంగా తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమికి గల కారణాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నట్లు మనోజ్‌జయంత్‌రెడ్డి పేర్కొన్నారు.

భారీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



భక్త ఆంజనేయస్వామి భారీ విగ్రహం

మదనపల్లె అర్బన్, జూన్ 9: స్థానిక భువనేశ్వరి నగర్‌లోని భువనేశ్వరీ ఆలయ ప్రాంగణంలో ఆదివారం అతి భారీ భక్త ఆంజనేయస్వామి విగ్రహాన్ని అమ్మవారి సేవకులు స్వామి వెంకటేష్ ఆధ్వర్యంలో వైభవంగా ప్రతిష్ఠించారు. ఉభయ రాష్ట్రాల్లోనే ఎక్కడా లేనివిధంగా 270 టన్నుల బరువు, 32 అడుగుల ఎత్తు కలిగిన ఏకశిలా భక్త ఆంజనేయ స్వామి విగ్రహాన్ని స్థానిక భువనేశ్వరీదేవి ఆలయంలో 35 అడుగుల ఎత్తు కలిగిన పీఠంపై భారీ క్రేనుల సహాయంతో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఏకశిలా విగ్రహాన్ని 14 ఏళ్ల పాటు ఆలయంలో ప్రత్యేకంగా షెడ్ నిర్మించి అందులో శిలను ఉంచి తరువాత ప్రతిష్ఠ కావించారు. ఈ సందర్భంగా అమ్మవారి సేవకులు స్వామి వెంకటేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో భువనేశ్వరీ అమ్మవారి ఆలయం ఆధ్యాత్మికంగా వెలుగుతుందన్నారు. ఇప్పటికే ఆలయంలో వివిధ రకాల ఏకశిలా విగ్రహాలను ఏర్పాటు చేశామని, స్పటిక లింగాన్ని, వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించి అభిషేకాలు, అర్చనలు. విశేషంగా పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్త బృందం పాల్గొన్నారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్త ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

ఏకపక్ష అధికారులకు శృంగభంగం!



తమ భవిష్యత్తుపై కిశోర్‌కుమార్ రెడ్డికి విన్నవిస్తున్న పీలేరు వలంటీర్లు

కలికిరి, జూన్ 9: గతంలో అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఏకపక్షంగా వ్యవహరించి టీడీపీ సానుభూతి పరులపై తీవ్రమైన వేధింపులకు పాల్పడిన అధికారులకు తీవ్ర స్థాయిలో శృంగభంగం జరిగింది. ఆదివారం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని ఆయన స్వగ్రామంలో కలుసుకోవడానికి అత్యుత్సాహం ప్రదర్శించి మెహర్బానీ పొందడానికి ప్రయత్నించిన అధికారులను పలువురు పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు నాయకులతో అంటకాగుతూ ఎదుటి పార్టీ వారిని వేధించే వారి పరిస్థితి ఎలా వికటిస్తుందో ఆదివారం జరిగిన కొన్ని సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.. వివరాలు.. నూతన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని కలుసుకుని అభినందించడానికి ఆదివారం పెద్ద సంఖ్యలో వివిధ శాఖలకు చెందిన అధికారులు నగరిపల్లెలో బారులు తీరారు. లోపల అంతా సవ్యంగా జరుగుతున్న సందర్భంలో కలికిరి డ్వామా కార్యాలయం ఏపీడీ నందకుమార్ రెడ్డి కూడా కిశోర్ కుమార్ రెడ్డిని కలుసుకోవడానికి ప్రయత్నించారు. ఈయన పీలేరు మండలంలోని తన సొంత పంచాయతీలో ఎన్నికల సమయంలో పెద్ద మొత్తంలో ఓటర్లకు డబ్బు పంచారనే ఆరోపణలున్నాయి. ఆయన భార్య జాండ్ల పంచాయతీ వైసీపీ సర్పంచు కూడా. అంతేగాకుండా గత ఐదేళ్లుగా టీడీపీ సానుభూతిపరులైన ఉపాధి హామీ పథకంలో పని చేసే కింది స్థాయి ఉద్యోగులను బాగా వేధించారని ప్రచారంలో ఉంది. గతేడాది ఇక్కడి నుంచి బదిలీ మీద వెళ్లి తీరా ఎన్నికలకు రెండు నెలలు మందు తిరిగి కలికిరి వచ్చారు. నందకుమార్ రెడ్డి వచ్చిన సమయంలో ఆయన తొలగించిన దాదాపు పది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అక్కడ తారసపడ్డారు. దీంతో ఆగ్రహోదగ్రులైన వారు నందకుమార్ రెడ్డిని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. నియోజకవర్గంలో దాదాపు 30 మంది కుటుంబాలను రోడ్డు పాలు చేసింది చాలక మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఇక్కడికొచ్చావంటూ నిలదీశారు. ఎమ్మెల్యేని కలుసుకోవడానికి వీలు లేదంటూ అడ్డుకున్నారు. గేటు బయట వరకూ తోసుకుంటూ వెళ్లారు. చివరకు ఆయన ఎమ్మెల్యేను కలవకుండానే వెళ్లిపోయారు. అదే విధంగా ప్రస్తుతం పనిష్మెంట్‌లో వున్న ఒక సీఐ కూడా భంగపడ్డారు. కిశోర్‌కుమార్ రెడ్డిని కలవడానికి వీలు లేదంటూ అడ్డుకుని తిప్పి పంపారు. టీడీపీ సానుభూతిపరులైన కొంత మంది వెలుగు సంఘమిత్రలకు వేధింపులతో అన్యాయం చేసి వైసీపీ నాయకురాలిగా వ్యవహరించిన ఒక సంఘమిత్ర లోనికి రాకుండా పలువురు అడ్డుకోగా ఆమె వెనుదిరిగారు. తమపై తప్పుడు కేసులు పెట్టి వేధించినందుకు నియోజకవర్గంలోని ఒక మారుమూల మండలానికి చెందిన ఎస్ఐని అక్కడి ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఇంటికొచ్చి ప్రాధేయపడినా మహిళ అని కూడా చూడకుండా అక్రమంగా కేసులు పెట్టావని దుయ్యబట్టారు. తోటి పోలీసులు సర్దుబాటు చేసినా ఫోను వస్తోందన్న నెపంతో ఆయన బయటకు వెళ్లిపోయారు. ఇక పీలేరు పట్టణం కళాకారుల సంఘం అధ్యక్షుడు కత్తి రామలింగా రెడ్డి సభ్యులకు ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం అండ చూసుకుని భూ ఆక్రమణలు చేశాడని ఆరోపణలున్నాయి. ఆయన మంత్రి, ఎంపీలకు అత్యంత సన్నిహితుడుగా పేరుంది. కిశోర్‌కుమార్ రెడ్డిని సన్మానించడానికి ఆయన లోపలికి వచ్చేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న పీలేరు నాయకులు అడ్డుకుని బయటకు గెంటేశారు. అనేక శాఖలకు చెందిన అధికారులు గౌరవప్రదంగా వచ్చి పోతున్నా ఎదురవ్వని చేదు అనుభవాలు అతిగా ప్రవర్తించిన వారి విషయంలో మాత్రం తప్పలేదు. బయట ఇంత జరుగుతున్నా లోపలున్న కిశోర్‌కుమార్ రెడ్డికి తెలియకుండా నాయకులు, కార్యకర్తలు తమ పని కానిచ్చారు. అయితే చివరగా విషయం తెలిసిన కిశోర్‌కుమార్ రెడ్డి అలా చేయడం సరికాదంటూ మందలించినట్లు తెలిసింది.

వలంటీర్ల వేడికోలు

పీలేరు పట్టణానికి చెందిన కొంత మంది వలంటీర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నాయకుల ఒత్తిడితో బలవంతంగా రాజీనామాలు చేయించారని వాపోయారు. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయానికి సంబంధించిందన్నారు. రాజీనామా చేయకుండా ఉండాల్సిందని కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. పీలేరు కార్పెంటర్స్ కాలనీకి చెందిన పలువురు తమ ఇళ్ల స్థలాల సమస్య గురించి చెప్పాలని వచ్చినా వీలు కాలేదు. తరువాత చూద్దామని చెపుతూ ఎల్లుండి జరుగనున్న టీడీఎల్పీ సమావేశానికి ఆయన బయలుదేరి వెళ్లిపోయారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనపల్లె అర్బన్, జూన్ 9: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1981- 82 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వ హించారు. ఆదివారం అందరూ కలిసి మెలసి తమ తీపి జ్ఞాప కాలను గుర్తు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు వచ్చి సహపంక్తి భోజనాలు చేశారు. తమ తమ మిత్రులతో ఫొటోలు దిగారు. అప్పటిలో తమకు చదువు చెప్పిన గురువులు సుబ్బారెడ్డి, గంగులరెడ్డి, జానికీరాం, పద్మావ తమ్మ, శ్యామలమ్మ, పాపులమ్మ, సుశీలమ్మలను దుశ్శాలువ కప్పి సన్మానించారు. పూర్వ విద్యార్థులు అందరూ కలిసి జడ్పీ హైస్కూల్‌కు మైక్‌సెట్ వితరణ చేశారు. సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బాబులాల్ గిఫ్ట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ రమేష్ హేమలత, నిరంజన్, ఇంజనీర్ సత్యసోముశేఖర్, జమున, ప్రకాష్, రాజు, జీయాఉద్దీన్, బీటి శ్రీకాంత్, కళాధర్, సుజాత, భారతి, సునందిని తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 9: మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహానికి ఎన్నికల కోడ్ ఉండటంతో నివాళులర్పించలేకపోయామని, ఇప్పుడు కోడ్ ముగియడంతో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్నామన్నారు. చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజలందరికి అందుబాటులో ఉంటూ పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, నాదెళ్ల విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, బోయపాటి రామ్మూర్తి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, బాబునాయుడు, పులి మహాలక్ష్మి, తలారి రాధ, సాకే లక్ష్మిదేవి, టీడీపీ నాయకులు నవీన్ చౌదరి, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, జీవీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఘన సన్మానం



షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న మార్పురి సుధాకర్‌నాయుడు

మదనపల్లె అర్బన్, జూన్ 9: నూతనంగా మదననల్లె ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎం. షాజహాన్‌బాషాను ఆయన స్వగృహంలో టీడీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు మర్యాదపూరకంగా కలిసి సన్మానించారు. ఆదివారం ఆయనను దుశ్శాలువ కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ 15 ఏళ్ల తరువాత మదనపల్లెలో టీడీపీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి విజయంతో ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా నూతనంగా ఏర్పాటుకానున్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మదనపల్లెను అన్నివిధాల అభివృద్ధి దిశగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నడిపిస్తారన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ వాసుశేఖర్, ఫణి పాల్గొన్నారు. కాగా అంతకు ముందు మదనపల్లె పట్టణంలోని సీఎస్ఐ చర్చిని, నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించి ప్రార్థనలు చేశారు. ఉదయాన్నే స్థానికంగా ఉన్న సీఎస్ చర్చిలో క్రైస్తవులు నిర్వహించిన ప్రార్థనలో ఎమ్మెల్యే షాజహాన్ పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చిపాస్టర్ రెవరెండ్ వరప్రసాద్ తోపాటు చర్చి కమిటీ కమిటీ కార్యదర్శి భక్తవత్సలం, సభ్యులు, దేవా రమేష్, సురేష్ పాల్గొన్నారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ మాత ఆలయకమిటీ అధ్యక్షుడు ఉప్పురామచంద్ర ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులతోపాటు మాజీ కౌన్సిలర్లు రామిశెట్టి నీలకంఠ, బండినాగరాజ, పురాణం చంద్రశేఖర్, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, టీడీపీ నాయకులు మోడెం సిద్దప్ప, నాగరాజ, కమలమరికృష్ణ, సుబ్బయ్య, బాలమల శేఖర్, బ్యాంకు రమణ, వేమయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తంబళ్లపల్లె, జూన్ 9: ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్ బెంగళూరు వారు ఆదివారం తంబళ్లపల్లె పాత కాలేజీ మైదానంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పవన్‌కుమార్, అక్షయ్, రవిశంకర్, పృథ్వీ, సవిత, లిఖిత, విశ్వాస్, నితిన్, పీఆర్వో శంకర్, దేవేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, జూన్ 9: పీలేరులోని ఎస్‌కేఆర్ హాస్పిటల్స్‌లో ఆదివారం జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీలేరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లోని 68 మంది శిబిరంలో పాల్గొని చికిత్స అందుకున్నారు. మదనపల్లెకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎస్ఆర్‌బాషా నేతృత్వంలో రోగులకు బీపీ, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఆర్ హాస్పిటల్స్ ఎండీ ఎస్‌కేఎం బాషా, వైద్యులు ఎస్‌కే వసీం, అస్పియా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దిగువ గిండి గంగమ్మ జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తంబళ్లపల్లె, జూన్ 9: మండలంలోని ఉప్పులూరివాండ్లపల్లెకు సమీపంలో వెలసిన దిగువ గిండి గంగమ్మ జాతరను ఆదివారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. పూజారులు గిండి ప్రభాకర్, వెంకటేష్‌లు అమ్మవారిని పుష్పాలు, నగలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కాలినడకన దీలూ, బోనాలూ తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చాందినీబండ్లను వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కోలాహలంగా వెళ్లి ఆలయం చుట్టూరా తిప్పారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు.



:గోపాలపురంలో చాందినీ బండి ఊరేగింపు

కలకడలో:మండలంలోని గోపాలపురంలో కొలువైన గ్రామదేవత దొడ్డిపల్లెమ్మ జాతరను గ్రామస్థులు వేడుకగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం రాత్రి బాణసంచా పేల్చుతూ చాందినీ బండి కోలాహలంగా ఊరేగించారు. ఆదివారం వేకువజామున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలను చేశారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

సీనియర్ సిటిజన్స్‌చే గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్

మదనపల్లె అర్బన్, జూన్ 9: స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్‌చే దక్షిణామూర్తి స్తోత్రం గంథాన్ని ఆవిష్కరించారు. కవి, నవలా, రచయిత కృష్ణమూర్తి గ్రంథావిష్కరణ చేయగా, ధనలక్ష్మీ గ్రంథ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్‌సాహెబ్, ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ, సలహాదారుల ప్రొఫసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, కృష్ణమూర్తి, ఎన్‌వీ నాయుడు, రామచంద్రయ్య, నాగరాజ, కృష్ణకుమార్, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న మహాభారత యజ్ఞం

నిమ్మనపల్లి, జూన్ 9: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లెలో మహాభారత యజ్ఞం అలరిస్తోంది. 9వ రోజు ఆదివారం ద్రౌపది సమేత ధర్మరాజు మహాభారత కురుపాండవ హరికథ నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో ఆదివారం మహాభారతం చూసేందుకు వచ్చారు. 21రోజుల పాటు మహాభారతాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

24న పీలేరులో ఉరుసు

పీలేరు, జూన్ 9: పీలేరులో హజరత్ మహబూబ్ సుబహాని 78వ ఉరుసు మహోత్సవం ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 24వ తేదీ రాత్రి స్థానిక జెండామాను వద్ద మీనారు వద్ద పూల తాజియా, విద్యుత్ దీపాల అలంకరణ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ మేరకు వారు మినారు వద్ద ఉరుసు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదాల్లో వన్యప్రాణుల బలి

నివారణకు చర్యలు చేపట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అటవీ సంరక్షణ గాలికొదిలేశారు. వేసవిలో ఆకతాయిలు పెట్టే నిప్పుతో వందలాది ఎకరాల్లో చెట్లు కాలిపోతున్నాయి. ఫైర్ ట్రాక్‌లు లేకపోవడంతో మంటలు అదుపుకాని పరిస్థితి. దీంతో ఆహారం కోసం పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులు.. రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి.

- పలమనేరు




పలమనేరు సమీప జాతీయరహదారిపై లారీ ఢీకొని మృతిచెందిన ఏనుగులు, వాహనం ఢీకొనడంతో మృతిచెందిన దుప్పి (ఫైల్ ఫొటోలు)

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ఆహారం, తాగునీటి వసతి కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. వన్యప్రాణులు.. ముఖ్యంగా ఏనుగులు, దుప్పులు, అడవిపందులు, అటవీ సరిహద్దు గ్రామాల్లో చెరకు, వరి, రాగి, అరటి తోటలపై దాడి చేస్తున్నాయి. రాత్రివేళల్లో వచ్చి తిని, పంటలను నాశనం చేస్తుండటంతో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని అటవీ సమీప గ్రామాల రైతులు చెరకు, రాగి సాగు నిలిపేశారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేదు. 100 కిలోమీటర్లకు పైగా కందకాలు తవ్వినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. సోలార్ విద్యుత్ కంచెకూడా కొంతకాలం సత్ఫలితాలిచ్చినా దాని నిర్వహణ సక్రమంగా లేక నిరర్థకమైంది. రెండేళ్లక్రితం అటవీ సరిహద్దుల్లో హ్యాంగింగ్ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కంచె మంచి ఫలితాలనిస్తుందని అధికారులు గుర్తించి దీన్ని పూర్తిస్థాయిలో అటవీ సరిహద్దులో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

అండర్‌బ్రిడ్జిల ఏర్పాటు ప్రతిపాదనలకే సరి

పలమనేరు కౌండిన్య శాంచురీ ప్రాంతంలో జాతీయ రహదారి ఉంది. ఈ అడవినుంచి మరో ప్రాంతానికి వన్యప్రాణులు వెళ్లాలంటే తప్పనిసరిగా రోడ్డు దాటాల్సిందే. ఆహారం కోసం వన్యప్రాణుల సంచారం రాత్రిళ్లే ఎక్కువ. దీంతో వన్యప్రాణులు ఈ రహదారులను దాటే సమయంలో అతి వేగంగా వెళ్లే భారీ వాహనాలు ఢీకొనడంతో మృత్యువాత పడుతున్నాయి. గతేడాది పలమనేరు సమీపంలోని బూతలబండ వద్ద రోడ్డు దాటుతున్న మూడు ఏనుగులను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాయి. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక చిన్నచిన్న దుప్పులు లెక్కలేనన్ని చనిపోతూనే ఉన్నాయి. దీంతో అధికారులు వన్యప్రాణులు రహదారులను దాటే ప్రాంతాలను గుర్తించారు. అక్కడ అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తే సురక్షితంగా రోడ్డుదాటుతాయని భావించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు. ఇవి కూడా అటకెక్కిపోయాయి.

ఎక్స్‌ప్రెస్ హైవేతో మరింత అలజడి

చెన్నై- బెంగళూరుకు కొత్తగా నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులతోనూ వన్యప్రాణులకు హాని కలుగుతోందని వన్యప్రాణి ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా కౌండిన్య శాంచురీ ప్రాంతంలో ఈ రహదారి పనులు చేపట్టారు. దాదాపు 100 అడుగుల వెడల్పుకంటే ఎక్కువగా చెట్లను నరికి కొత్తరోడ్డు వేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా వచ్చే పెద్ద పెద్ద బండరాళ్లను పేల్చి.. చదును చేస్తున్నారు. ఈ పేలుడు శబ్దాలతో అడవిలోని వన్యప్రాణులు చెల్లాచెదురవుతున్నాయి. ఇవి ప్రాణభయంతో పరుగులు పెడుతూ రహదారులపైకి రావడంతో గుర్తుతెలియని వాహనాలు ఢీకొంటున్నాయి. రహదారి పనులు బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జరుగుతోంది. వన్యప్రాణుల మృతికి ఇదికూడా కారణమని పలువురు అంటున్నారు.

అడవికి నిప్పుపెట్టడంతో..

సాధారణంగా వేసవిలో అటవీ ప్రాంతంలోని చెట్లు ఆకులు రాల్చివేస్తాయి. ఆ సమయంలో పశువుల కాపర్లు కొందరు, జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులు కొందరు సిగరెట్లు తాగి ఎండిపోయిన ఆకులకు నిప్పు రగిల్చి వెళ్లిపోతున్నారు. ఇలా ఒక చోట పెట్టిన నిప్పు విస్తరించి ఎకరాల కొద్దీ చెట్లు కాలిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో నేడు వందలాది ఎకరాల్లో అడవి బీడుభూమిగా దర్శనమిస్తోంది. దశాబ్దం కిందట వేసవిలో అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలతో అధికారులు సమావేశాలు నిర్వహించేవారు. చెట్ల ప్రాధాన్యాన్ని వివరించి.. అడవిని కాపాడుకొనేలా అవగాహన కల్పించేవారు. ఎవరైనా అడవికి నిప్పు పెట్టారని తెలిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించేవారు. రహదారి వెంబడి తరచూ క్షేత్రస్థాయి సిబ్బంది సంచరిస్తూ వాహనదారులపై నిఘా వేసేవారు. దశాబ్ద కాలంగా ఇటువంటి చర్యలు లేవు. గతంలో అడవిలో అక్కడక్కడా సుమారు 10 అడుగుల వెడల్పుతో ఫైర్‌ట్రాక్ ఏర్పాటు చేసేవారు. దీంతో ఒకచోట ఎవరైనా నిప్పు పెట్టినా ఈ ఫైర్‌ట్రాక్ వద్దకు వచ్చిమంటలు ఆగిపోయేవి. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ఫైర్‌ట్రాక్‌లను ఏర్పాటు చేయడంలేదు. దీంతో ఇప్పుడు ఒకచోట అగ్ని ప్రమాదం సంభవిస్తే వందలాది ఎకరాల్లో చెట్లు కాలిపోతున్నాయి.

ఆగని గజదాడులు



మామిడి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, జూన్ 9: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో మామిడి, కొబ్బరి, తదితర పంటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని కమ్మపల్లె పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లెకి చెందిన మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి పొలంలోకి శనివారం రాత్రి ప్రవేశించిన ఏనుగుల గుంపు 20 మామిడి చెట్లను విరిచేశాయి. సుమారు నాలుగు టన్నుల మామిడికాయలను నేలరాల్చాయి. పలు కొబ్బరి చెట్లను విరిచేశాయి. ఏడు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఐరాల, జూన్ 9: నూతనంగా ఏర్పడనున్న ప్రభుత్వం ఉపాధ్యాయులతో స్నేహంగా మెలుగుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నాంపల్లెలోని కల్యాణ మంటపంలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వ పోకడలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియను, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ.రమణ, నాయకులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, మెహానబేగం, రాధాకృష్ణ, ఏకాంబరం, సురేష్‌బాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు

టీడీపీ అధికారంలోకి రావడం.. నారా లోకేశ్ భారీ మెజారిటీతో గెలవడంతో ఆదివారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్

ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు (సెంట్రల్), జూన్ 9: జిల్లాలో శనివారం ఉదయం 9 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు ఏడు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పం మండలంలో 11.2 మి.మీ నమోదు కాగా, బంగారుపాళ్యం 6.2, ఐరాల 5.2, చిత్తూరు అర్బన్ 5, కార్వేటినగరం 4.6, గంగాధరనెల్లూరు 4.4, పూతలపట్టులో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



పాకాల, జూన్ 9: పాకాల మండల పరిధిలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిలో పెరుమాళ్ల గుడిపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన బన్ని (22) చిత్తూరు ఎస్వీ సెట్‌లో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై చౌడేపల్లె వెళ్తూ పెరుమాళ్ల గుడిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న సుమోను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పాకాల ఎస్సై మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిసారతో బాలిక మృతి




భవ్య (ఫైల్‌ఫొటో).. దళితవాడలో అధికారుల సహాయక చర్యలు

పుత్తూరు, జూన్ 9: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసార వ్యాధితో భవ్య(12) అనే బాలిక ఆదివారం మరణించింది. ఆ పంచాయతీలో నాలుగు రోజుల కిందట రాజగోపాల్ ఆచారి మృతి చెందిన విషయం తెలిసిందే. పది రోజులుగా ఈ పంచాయతీలోని జనం.. వాంతులు, విరేచనాల బారినపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ ప్రాంతాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పర్యటించి.. సహాయ చర్యలను చేపట్టారు. తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించారు. ఈ శిబిరం సోమవారం కూడా కొనసాగిస్తామని తెలిపారు. దాదాపు 25 ఏళ్ల నాటి ఇంటి కొళాయి లైన్లను తీసి వేసి.. కొత్తవి అమర్చుతున్నారు. తాగునీటిని కూడా రైతుల పొలం నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. తాత్కాలికంగా ప్రతి ఇంటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్ అందించారు. వాటర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపామని కమిషనర్ పేర్కొన్నారు.

వైసీపీ నేత ఇంటి పునాదిపై టీడీపీ జెండా



ఇంటి పునాదిపై యువగళం జెండా ఎగురవేస్తున్న టీడీపీ కార్యకర్త

కుప్పం, జూన్ 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో పొందిన అవమానాలు, వారిపై జరిగిన దాడులను మరువలేకపోతున్నారు. ఈ క్రమంలో కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లె చెక్‌పోస్టు సమీపంలో నిర్మాణంలో ఉన్న వైసీపీ నేత, రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్‌కుమార్ ఇంటి పునాదులపై టీడీపీకి చెందిన యువగళం జెండాను ఆ పార్టీ కార్యకర్త ఒకరు ఆదివారం ఎగురవేశారు. ఆ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'మా దేవుడికే బాంబేస్తావా? ఇప్పుడు చూడరా, నిన్నేం చేస్తానో? నన్ను కాపాడేదానికి మా దేవుడు లోకేశ్ అన్న ఉండాడు. నిన్ను కాపాడేదానికి పెద్దిరెడ్డి పుడింగి ఉండాడా?' అని మాట్లాడే వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై వైసీపీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 79,398 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 43,557 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆగివున్న కారును ఢీకొన్న వ్యాను

- బాలుడి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- తిరుమలకు వెళుతుండగా ఘటన





నుజ్జునుజ్జయిన కారు, కారులో మృతిచెందిన బాలుడు

బంగారుపాళ్యం, జూన్ 9: చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద ఆదివారం ఆగి ఉన్న కారును వ్యాన్ ఢీకొనడంతో బాలుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శివకుమార్, దీప దంపతులు, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన లోకేశ్వర్ తిరుమల శ్రీవారి దర్శనార్థం కారులో బయలుదేరారు. కేజీసత్రం వద్ద రోడ్డు పక్కన కారు ఆపి విశ్రాంతి తీసుకుంటుండగా చిత్తూరు వైపు మామిడికాయల లోడ్డుతో వెళ్తున్న వ్యాను కారును వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న లోకేశ్వర్ (12) సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతిచెందాడు. దీప, శివకుమార్‌లకు తీవ్ర గాయాలవడంతో 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లోకేశ్వర్‌కు సెలవులు కావడంతో మామ శివకుమార్ ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియనుండడంతో శ్రీవారి దర్శనం చేసుకుని సొంతూరుకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. దైవదర్శనం చేసుకోకనే మృతిచెందాడు. పైగా రెండో రోజుల్లో ఆ బాలుడి జన్మదినం కూడా ఉండడంతో దాన్ని తలచుకుంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

పుంగనూరుకున్న చెడ్డపేరు తొలగించడానికి సహకరించండి



పుంగనూరు స్టేషన్‌లో రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణురఘువీర్

పుంగనూరు, జూన్ 9: రాష్ట్రంలోనే పుంగనూరుకు ఉన్న చెడ్డపేరు తొలగించి ప్రశాంతమైన ఊరుగా తీర్చిదిద్దడానికి అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన తెలుగుదేశం, బీజేపీ, వైసీపీ, తదితర పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత పుంగనూరుకు తోడ్పడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజల తీర్పుతో ప్రభుత్వం మారిందని, గతంలో తమపై తప్పుడు కేసులు, అరెస్టులు, ఇబ్బందులు పెట్టారని ఎవరూ గొడవలకు దిగరాదని సూచించారు. పోలీసులకు ఎవరూ కిరీటం పెట్టరని, నిజాయితీగా పనిచేస్తారని, ఎవరికి సమస్య వచ్చినా తమదృష్టికి తేవాలని సూచించారు. పుంగనూరులో కాంట్రాక్టర్లు, రౌడీషీటర్లు, పెద్దవారి కోసం పోలీసులు అధిక సమయం వెచ్చించరని, పేదల సమస్యలు పరిష్కారించాల్సిన బాధ్యత తమపై ఉండటంతో వారికే ఎక్కువ సమయం ఇస్తామని వివరించారు. 'గతంలో నేను ఇక్కడ పనిచేయలేదు. నేను నిజాయితీగా, నిష్పక్షపాతంగా పని చేస్తా. ఎవరు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తాం. నిందితులకు శిక్ష పడేలా చేస్తాం. నిజం ఉన్నవారికి న్యాయం జరుగుతుంది. పుంగనూరులో గొడవలు, అల్లర్లు సృష్టించేవారి ధోరణి మారకపోతే చర్యలు కఠినంగా ఉంటాయి. కేసు దర్యాప్తు కోణంలో తేడా ఉంటే అప్పుడు పోలీసులను ప్రశ్నించవచ్చు. ఏ రాజకీయపార్టీల వ్యక్తులు అనవసరంగా గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా పుంగనూరుకు మంచి పేరుతెచ్చేలా ఒక్కమాటపై ఉండాలి' అని డీఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో రాజకీయ నాయకులు, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐలు మహ్మద్‌రఫీ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు క్వాలిటీ మొక్కలు అందిస్తాం

సెల్వి కల్చరిస్ట్ యశోదబాయి



బయోట్రిమ్‌కు కొత్తగా వచ్చిన ఆటో క్లేవ్ పరికరం

మంగళం, జూన్ 9: తక్కువ సమయంలో ఆదాయం వచ్చేలా క్వాలిటీ ఉన్న మొక్కలను రైతులకు అందిస్తామని తిరుపతిలోని బయోట్రిమ్ సెల్వి కల్చరిస్ట్ యశోదబాయి తెలిపారు. ఈ మొక్కలను క్వాలిటీ గల మదర్ ట్రీ ద్వారా ల్యాబ్‌లో డెవలప్ చేస్తున్నామని చెప్పారు. ఇవి తక్కువ నెలలోనే పెరిగి రైతులకు మంచి ఆదాయాన్ని అందించేలా చూస్తున్నామన్నారు. ఇందుకుగాను ల్యాబ్‌లో మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించి కొత్తవి తెప్పించినట్లు వివరించారు. ఇప్పటికే దాదాపు 50వేల ఎర్రచందనం మొక్కలను రైతులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నామని, వీటితోపాటు టేకు, వెలగ, అడవి నేరేడు, బిల్వ మొక్కలను డెవలప్ చేస్తున్నామన్నారు. అలాగే గార్డెన్లలో పెంచుకునే మొక్కలతోపాటు దాదాపు పదిరకాల మొక్కలను రైతులకు అందించేలా సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు.

బయో ట్రీమ్‌కు కొత్తగా మూడు ఆటోక్లేవ్స్

బయోట్రిమ్‌కు కొత్తగా మూడు ఆటోక్లేవ్స్ పరికరాలు తెప్పించారు. వీటితోపాటు కొన్ని ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు వచ్చాయి. దాదాపు రూ.10లక్షలతో ఈ పరికరాలను తెప్పించారు. అలాగే మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించారు.

రెండవఘాట్‌రోడ్డులో కూలిన వృక్షం



రోడ్డుగా అడ్డుగా పడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

తిరుమల, జూన్9(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ భారీ వృక్షం కూలింది. తిరుమలలో ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. తిరుమలకు సమీపంలోని మూడవ మలుపు వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆసమయంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. వేగంగా చెట్లను కట్‌చేసి పక్కకు తొలగించారు. అనంతరం వాహనాలను ముందుకు పంపారు. గత వారంరోజులుగా వర్షం పలు సందర్భాల్లో కురిసిన నేపథ్యంలో ఘాట్‌రోడ్డులో తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రదేశాలు, చెట్లు కూలే ప్రాంతాల్లో నిఘా పెట్టారు. అనుకోని ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే స్పందించేలా ప్రణాళికలు రూపొందించారు.

నన్ను ఓడిస్తే దోచుకోవచ్చనుకున్నారు : ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ,జూన్9: సత్యవేడు నియోజకవర్గంలో వనరులను దోచుకోవడానికే తనను ఓడించాలని ప్రయత్నించారంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కోనేటి ఆదిమూలం ఆరోపించారు. సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగలలో ఆదివారం అభినందన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వనరులను పెద్దిరెడ్డి ఎలా దోపిడీ చేస్తున్నారో గతంలో జగన్‌కు వివరించానని తెలిపారు. అందుకే తనకు వైసీపీ టిక్కెట్టు ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పరిస్థితి వివరించగా తనకు పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. పెద్దిరెడ్డి అవినీతిని బయట పెట్టినందుకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు డబ్బులిచ్చి తన గెలుపును అడ్డుకోవాలని ప్రయత్నించారని విమర్శించారు. అయినా, తనపై నమ్మకంతో ప్రజలు గెలిపించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అణుగుణంగా పనిచేస్తామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. తన విజయం కోసం కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భక్తజనసంద్రంగా బోయకొండ




క్యూలైన్లలో వేచియున్న భక్తులు(ఇన్‌సెట్‌లో) ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూన్ 9: బోయకొండ ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణలతో అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో అమ్మవారి దర్శనార్థం గంటల కొద్దీ భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా ఒక్క రోజే రూ.12 లక్షల ఆదాయం చేకూరింది.

వరసిద్ధుడికి రూ.35 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 9: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లికి చెందిన గోపినాథ్ ఆదివారం రూ.35లక్షలు విరాళంగా అందించారు. ఇందులో అన్నదాన కార్యక్రమానికి రూ.20లక్షలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ.15లక్షలు అందించారు. దాతకు ఈవో వెంకటేశు స్వామి దర్శన భాగ్యం కల్పించి, వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.